కర్నూలు | నంద్యాల
వార్త
25 ఏప్రిల్ 2026 శనివారం పేజీలు 4

# భక్తుల సౌకర్యాలను మెరుగుపరచాలి: ఈఓ శ్రీనివాసరావు

**శ్రీశైలం ప్రాజెక్టు,ఏప్రిల్24,ప్రభాతవార్త :** శ్రీశైలక్షేత్రంను సందర్శించే భక్తుల సౌకరా ్యలను మెరుగు పరచాలని శ్రీశైలదేవస్థానం ఈఓ యం.శ్రీనివాసరావు అన్నారు.శుక్రవారంనాడు పరిపాలన భవన సముదాయంలో ఆయా విభాగాల యూనిట్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ వసతి, ఆలయం, దర్శనాలు, అన్నప్రసాద వితరణ, ఇంజనీరింగ్, పారిశుధ్యం మొదలైన విభాగాలన్నీ కూడా తగు కాలపరిమితిని నిర్ధారిం చుకోని ఆయా విభాగాల అధికారులు దిశా నిర్దేశం చేసుకోవాలని తెలిపారు.వసతులపై భక్తుల నుండి 90శాతం





సానుకూలత స్పందన ఉండలన్నారు.ఉదయం వేళ్లలో వేడిపాలు, అల్పాహారం,మంచీనీరు నిరంతరం అందజేయాల న్నారు. పారిశుధ్య నిర్వహణ పకడ్బందిగా ఉండలన్నారు.ఈ సమావేశంలో అన్ని శాఖల అదికారులు,వివిధ విభాగాల పర్యవేక్షకులు,సంబందిత సిబ్బంది పాల్గొన్నారు.

# ఆదోనిలో.. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు..!

## - సీజ్ చేసిన బైక్ గల్లంతు..!? - బాధితుడి ఆవేద




**ఆదోని క్రైమ్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:** ఆదోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో హైదరాబాద్‌కు చెందిన సోమశంకర్ అనే వ్యక్తి తన బంధువుల ఇంటికి రావడంతో ప్రారంభమైన ఘటన, ఇప్పుడు పోలీసుల పై అనుమానాల వ్యక్తమవుతున్నాయి.వివరాల్లోకి వెళితే.. 15 092025న సోమశంకర్ ఆదోని పట్టణం లో వడ్డెగిరి గవర్నమెంట్ స్కూల్ వద్దకు చేరుకున్నాడు. అదే రోజు రాత్రి సుమారు 11:30 గంటల సమయంలో పోలీసులు అక్కడికి చేరుకుని డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా అప్పటి సీఐ శ్రీరాం అతనికి పరీక్ష నిర్వహించి, అతను ప్రయాణిస్తున్న అవెంజర్ బైక్ (టీ స్ 08 ఎఫ్ బి5173)ను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీసులు రూ.10,000 జరిమానా చెల్లించి వాహనాన్ని తీసుకెళ్లాలని సూచించినట్లు బాధితుడు తెలిపాడు. అయితే అప్పట్లో తన వద్ద అంత మొత్తంలో డబ్బు లేకపోవడంతో, ఒక వారం రోజుల్లో వచ్చి వాహనం తీసుకెళ్తానని చెప్పి వెళ్లిపోయాడు. వారం రోజుల తర్వాత స్టేషన్‌కు వెళ్లగా.. "ఇంకా కొన్ని రోజులు ఆగండి", "పది రోజులు తర్వాత రండి", "ఒక నెల తర్వాత రండి" అంటూ పోలీసుల నుంచి వాయిదాలు మాత్రమే ఎదురయ్యాయని సోమశంకర్ ఆరోపిస్తున్నాడు. ఇలా గడిచిన రోజులు.. వారాలు.. చివరకు నెలలు దాటిపోయాయి. ప్రస్తుతం ఏడు నెలలు పూర్తయినా, తన బైక్ గురించిన స్పష్టత లేదని వాపోతున్నాడు. ఇంతకాలం తర్వాత పోలీస్ స్టేషన్‌కు వెళ్లి విచారించగా, ఆ వాహనం అక్కడ లేదని చెప్పడం మరింత అనుమానాలకు తావిస్తోంది. "వాహనం ఎక్కడికి పోయింది? ఎవరైనా అమ్మేశారా? లేక రికార్డుల్లో తప్పుదోవ పట్టించారా?" అని బాధితుడు ప్రశ్నిస్తున్నాడు. జరిమానా చెల్లించడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ ఇప్పటివరకు వాహనం ఇవ్వకపోవడం, అలాగే వాహనం పోలీస్ స్టేషన్ లో లేకపోవడం పై ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని సోమశంకర్ కోరుతున్నాడు. ఈ ఘటనపై పోలీసుల స్పందన ఏమిటి? వాహనం నిజంగా ఎక్కడుంది? లేకపోతే దాని వెనుక మరేదైనా గుట్టు ఉందా? అనే అంశాలు ఇప్పుడు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి.



# పెట్రోల్ డీజిల్.. కొరత..!

- బంకుల ముందు నో స్టాక్ బోర్డులు
- జిల్లాలో 30కి పైగా బంకులు మూసివేత
- కృత్రిమ కొరత ఒక కారణమే ఆయిల్ కంపెనీల సరఫరా తక్కువే
- రబీ కోతల సమయంలో యంత్రాలు నిలిచిపోవడంరైతులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు

• వివరాలు 2లో






**పెట్రోల్ డీజిల్ కొరత తీవ్ర ప్రభావం చూపుతోంది. వాహనదారులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కారణం ఏమిటి అనే విషయంపై పూర్తి స్పష్టత లేదు. ఆయిల్ కంపెనీలు పూర్తిస్థాయిలో సరఫరా చేయడం లేదని పెట్రోల్ బంకుల యజమానులు అంటున్నారు. బ్లాక్లో అమ్ముకునేది కుట్ర పన్నుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఏది ఏమైనా పరిస్థితి రెండు రోజుల్లో చక్కబడు తుందని అధికారులు చెబుతున్నారు. మరి ఈ పెట్రోల్ డీజిల్ కొరత సమస్యకు యుద్ధం కారణం కాదా.. అనే ప్రశ్న కూడా వినిపిస్తుంది. ప్రస్తుత పరిస్థితులు ప్రారంభమేనని.. కాలక్రమంగా ఈ కొరత తీవ్రమవుతుందా అన్న అను మానాలు ప్రజల్లో నెలకొన్నాయి.**

**కర్నూలు, ఏప్రిల్ 24, ప్రభాతవార్త :** ఉమ్మడి కర్నూలు జిల్లాల్లో పెట్రోల్, డీజిల్ కొరత తీవ్రరూపం దాల్చి వ్యవసాయ రంగంతో పాటు రవాణా వ్యవస్థపై గణనీయమైన ప్రభావం చూపుతోంది. ముఖ్యంగా రబీ సీజన్‌లో వరి కోతలు ముమ్మరంగా సాగుతున్న ఈ సమయంలో డీజిల్ లభించకపోవడం రైతులకు పెద్ద సవాలుగా మారింది. వరి కోత యంత్రాలు నిలిచిపోవడంతో కోతలు ఆలస్యమవు తున్నాయి. సాధారణంగా 10 ఎకరాల వరి కోయడానికి యంత్రం 10 నుంచి 15 గంటలు పనిచేయాల్సి ఉండగా, రోజుకు 100 నుంచి 160 లీటర్ల డీజిల్ అవసరం అవుతుంది. అయితే గ్రామీణ ప్రాంతాల్లోని పెట్రోల్ బంకుల్లో సరిపడా డీజిల్ స్టాక్ లేకపోవడంతో యంత్రాలు షెడ్లకే పరిమిత మవుతున్నాయి. కొన్ని బంకుల్లో పరిమి తంగా సరఫరా ఉన్నప్పటికీ ఒక్కొక్కరికి 50 లీటర్లకు మించి ఇవ్వడం లేదని రైతులు చెబుతున్నారు. ఇక రవాణా రంగంలో కూడా ఈ కొరత ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. నగరాలు, పట్టణాల్లోని అనేక బంకుల్లో "నో స్టాక్" బోర్డులు కనిపిస్తున్నాయి. స్టాక్ ఉన్న కొన్ని బంకుల వద్ద వాహనదారులు భారీగా బారులు తీరుతున్నారు. గంటల తరబడి వేచి చూసినా ఇంధనం దొరకక నిరాశతో వెనుదిరుగుతున్న పరిస్థితి నెలకొంది.

# ఆదోనిలో.. కల్తీ కల్లు దందా..!

## : ఎక్సైజ్ అధికారుల నిర్లక్ష్యంపై ఏఐవైఎఫ్ ధర్నా - తక్షణ చర్యలకు డిమాండ్..



**ఆదోని,ఏప్రిల్ 24, ప్రభాతవార్త ప్రతినిధి ;** ఆదోని పట్టణం మరియు పరిసర ప్రాంతాల్లో విచ్చలవిడిగా సాగుతున్న కల్తీ కల్లు అక్రమ వ్యాపారంపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆదోని ఎక్సైజ్ శాఖ కార్యాలయం ముందు ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించి, అనంతరం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌కు వినతి పత్రం అందించారు. నిరసన కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సుదర్శన్, పట్టణ కార్యదర్శి టి. వీరేష్ మాట్లాడుతూ, "గ్రామీణ ప్రాంతాల నుంచి కల్లును తెచ్చి, రహస్య ప్రదేశాల్లో నిల్వ చేసి, అందులో ప్రాణాంతక రసాయనాలు కలిపి మత్తు పెంచేలా తయారు చేసి విక్రయిస్తున్నారు. ఈ కల్తీ కల్లు సేవించడం వల్ల ముఖ్యంగా కూలీలు, పేద ప్రజల కిడ్నీలు, కాలేయం దెబ్బతిని తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారు. ఇన్ని జరుగుతున్నా ఎక్సైజ్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం శోచనీయం" అని విమర్శించారు. ఆదోని పట్టణం మరియు పరిసరాల్లో ప్రత్యేక దాడులు నిర్వహించి కల్తీ కల్లు తయారీ కేంద్రాలను గుర్తించి మూసివేయాలి. అక్రమ వ్యాపారులపై కఠినమైన క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. ప్రజలకు కల్తీ కల్లు వల్ల కలిగే అనర్థాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలి. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఈ సమస్యపై అధికారులు తక్షణమే స్పందించాలని, లేనిపక్షంలో ప్రజా పోరాటాలను ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు కె. రమేష్, జి. అంజిత్ గౌడ్, కె. లింగప్ప, సిపిఐ మండల కార్యదర్శులు ఎల్లప్ప, సత్యనారాయణ, డిహెచ్‌పిఎస్ నియోజకవర్గ కార్యదర్శి విజయ్ కుమార్, ఏఐవైఎఫ్ నాయకులు పుష్ప రాజ్, బుజ్జి, తదితరులు పాల్గొన్నారు...




## శతాబ్దాల చరిత్రతో మెరిసే..

# బంగినపల్లి.. మామిడిపండ్లు..!

- తీపి రుచికి ప్రపంచ గుర్తింపు
- నవాబుల కాలం నుంచి నేటి వరకు తోటల వైభవం
- కృత్రిమ పాకంతో ప్రతిష్ఠకు ముప్పు





**ఆంధ్రప్రదేశ్‌లోని బంగినపల్లి ప్రాంతం పేరు వినగానే ముందుగా గుర్తుకు వచ్చేది మామిడి పండ్లే. శతాబ్దాల కాలంగా పేరుగాంచిన బంగనపల్లి బెనిషన్ మామిడిపండ్లు దేశ విదేశాల్లో ప్రత్యేక గుర్తింపు సంపాదించాయి. తీపి రుచి, మృదువైన గుజ్జు, సహజ సువాసనతో ఈ పండ్లు ప్రపంచ మార్కెట్‌లో ప్రత్యేక స్థానాన్ని దక్కించుకున్నాయి. బనగానపల్లె మండల పరిసర ప్రాంతాల్లో విస్తారంగా ఉన్న సుమారు 350 ఎకరాల మామిడి తోటలు చరిత్రకు సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. నవాబుల కాలంలోనే ఈ ప్రాంతంలో మామిడి తోటల పెంపకం ప్రారంభమైందని స్థానికులు చెబుతున్నారు. ఆ కాలంలో నాటిన కొన్ని పాత చెట్లు ఇప్పటికీ ఫలాలు ఇస్తుండటం విశేషం. ఈ తోటలు బంగనపల్లి బెనిషన్ మామిడిపండ్లకు శతాబ్దాల వారసత్వాన్ని అందిస్తున్నాయి.**

**బనగానపల్లె, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:** బంగినపల్లి బెనిషన్ మామిడిపండ్లు సాధారణంగా ఏప్రిల్ నుంచి జూన్ మధ్యకాలంలో సహజంగా పాకానికి వస్తాయి. చెట్లపై పండిన మాడిపండ్లలో అసలైన తీపి, సువాసన వెల్లివిరుస్తాయి. ఈ కాలంలో మార్కెట్లు సందడిగా మారి, ప్రతి ఇంటిలో మామిడి పండ్లు ప్రత్యేక స్థానం సంపాదిస్తాయి. సహజంగా చెట్లపై పండిన బంగినపల్లి బెనిషన్ మాడిపండ్లకు ప్రత్యేకమైన తీపి, పలుచని తొక్క, తక్కువ తంతువు లక్షణాలు ఉంటాయి. ఇవే లక్షణాలు ఈ పండ్లను ఇతర రకాల మామిడిపండ్లతో పోలిస్తే ప్రత్యేకంగా నిలబెడుతున్నాయి. పాత తరాల నుంచి వస్తున్న ఈ సంప్రదాయం..

2లో

# ప్రతి నీటి బొట్టును.. ఒడిసి పడుతాం

## : భావితరాలకు నీటి అవసరాలు తీరుద్దాం : జిల్లా కలెక్టర్ సి.రి



**క్రిష్ణగిరి,ఏప్రిల్24,ప్రభాతవార్త :** వర్షం నుంచి పడే ప్రతి వర్షపు నీటి బొట్టును ఒడిసి పట్టి భావి తరలాలకు నీటి అవసరాలు తీరుద్దామని కర్నూలు జిల్లా కలెక్టర్ ఏ.సిరి అన్నారు.శుక్రవారం క్రిష్ణగిరి మండల పరిదిలోని అమకతాడు గ్రామంలో జలధార జలహారతి పనులతో నీటి భద్రతను బలోపేతం చేస్తూ భూగర్భజలాలను జలాలను పెంపే లక్ష్యంగా నీటివనరులను పునద్దరించటం జరుగు తుందని కలెక్టర్ అన్నారు. ఉపాది కూలీలు, ఉపాది సిబ్బంది, అదికారులు, సిబ్బందితో కలిసి సమావేశం నిర్వహించారు.ఈ సందర్బంగా సభలో ఆమె మాట్లాడుతూ ఎగువ నుంచి దిగువకు వచ్చే ప్రతి నీటి నిలువ చేసే విదంగా చెక్‌డ్యాములు, నీటికుంటలు, పండకుంటలు ఏర్పాటు చేసుకోవాలన్నారు.దీని వలన భవిష్యత్తులో నీటికొరత ఏర్పడకుండా ఉంటుందన్నారు.చౌడమ్మకుంట చెరువు,భద్రుడు చెక్‌డ్యాములకు భూమిపూజ చేసి పనులు ప్రారంభోత్సవం చేశారు.ఈచెక్‌డ్యాము లు 20లీటర్ల లోతు 200మీటర్ల పొడవుతో చెక్‌డ్యాములు నిర్మాణం చేపట్టాలన్నారు. దీనివలన 18లక్షల లీటర్ల నిల్వనీటి సామర్థ్యం కలిగి ఉంటుందన్నారు.15హెక్టార్లు వ్యవసాయ భూమికి సాగునీటి అందించవచ్చునని అన్నారు.గ్రామంలోని ఉప్పువంక,పడమర వంక, చెరువులు, కుంటలు, కాలువలు, జంగిల్ క్లియరెన్స్ చేసి హంద్రినీవా నీటిని సమర్థ వంతగా ఉపయోగించవచ్చునన్నారు. అనంతరం కూలీలతో మాట్లా దుతూ పనులు చేసే విదానం,పనిదినాలు,వేతనాలు చెల్లింపులు వంటి విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా,మండలస్థాయి అధికారులు ప్రజాప్రతినిధులు పత్తికొండ మార్కెట్‌యార్డు ఛైర్మన్ నబిసాహెబ్,సగర సంఘం రాష్ట్రడైరక్టర్ ప్రసాదు,టి.డి.పి సీనియర్ నాయకులు మద్రిశ్రీరాములు,ప్రదాన కార్యదర్శి గురుస్వామి, తెలుగు యువత అధ్యక్షులు బొంతిరాళ్ల రఫీసాహెబ్అమకతాడువీరభద్రుడు, సుధాకర్, గుమ్మకొండ వెంకటేశ్వర్లు, వెంకటేశు, శ్రీనివా సులు, రజాక్, కర్లకుంట రామకృష్ణ,జయన్న తదితరులు పాల్గొన్నారు.

# పెట్రోలు డీజలను బ్లాక్ మార్కెట్‌చేస్తే.. కఠిన చర్యలు



**నంద్యాల ,ఏప్రిల్ 24,ప్రభాతవార్తప్రతినిది :** జిల్లాఓ ఎక్కడా ఇందన కొరత లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుం టామని కలెక్టరు రాజకుమారి వెల్లడించారు.శుక్రవారము కలెక్టరు చాంబరులో గత రెండు రోజులు జిల్లాలో ఏర్పగడిన పెన్రట్రోలు డీజల్ అంతరాయంపైజిల్లాయస్‌పి సునీల్ షేరాన్‌తో కలిసి సమీఓ నిర్వహించారు.ఈసందర్బముగా కలెక్టరు మాట్లాడుతూ ఇందన కొరత సమప్య తలెత్తకుండా ప్రత్యేక శ్రద్ధతో తోన చర్యలు చేపట్టాలని సంబందిత అదాకారులతో పాటు పెట్రోలు బంక్ యాజమానులకు స్పష్మటైన అదేశాలు జారీ చేశారు,.ప్రజలకు ముఖ్యంగా వ్యవసాయా కార్యకలాపాలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని అమె సూచించారు. జిల్లాలో ఇందన డిమాండుకుఅనుగుణంగా సరఫరా జరుగడంలేదని అదికారులు కలెక్టరు దృష్టికి తెచ్చారు.నంద్యాల జిల్లా వ్యాప్తంగా మొత్తం 199 పెట్రోలు బంకులు ఉన్నాయని తెలియజేస్తూ జిల్లాకు అవసరమైన ఇందన నిల్వలను సమకూర్చేందుకు ఉన్నతాదికారులతో సమన్వయం కొనసాగిస్తున్నామని కలెక్టరు చెప్పారు,.

# నియోజకవర్గంలో త్రాగునీటి ఎద్దడి రాకుండా చూడాలి

- మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో ఉన్నతస్థాయి సమావేశం
- మంత్రి ఫరూక్, జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా




**నంద్యాల,ఏప్రిల్ 24,ప్రభాతవార్త ప్రతినిధి:** నంద్యాల నియోజకవర్గంలోని ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలుగకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి.ఫరూక్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం పట్టణ మున్సిపల్ కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్, పబ్లిక్ హెల్త్ శాఖ అధికారులు, మున్సిపల్ కమీషనర్, రెవిన్యూ అధికారులతో తాగునీటి పరిస్థితిపై మంత్రి ఫరూక్, జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా సమీక్షా సమావేశం నిర్వ:హించారు. ఈ సంధర్భంగా మంత్రి మాట్లాడుతు పట్టణ మరియు గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి లభ్యతపై మంత్రి శాఖల వారిగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎక్కడైన పైపులైన్లు లీకేజీలు లేదా మోటార్ల మరమ్మత్తులు ఉంటే యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్, పబ్లిక్‌హెల్త్ మరియు మున్సిపల్ శాఖలు పరస్పర సమన్వయంతో పని చేసి శివారు ప్రాంతాలకు సైతం నీరు అందేలా చూడాలని ఆదేశించారు. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో ట్యాంకర్లు ద్వారా సరఫరాకు అవసరమైన ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలని తహాసిల్దార్, ఆర్డీఓ మరియు ఎంపిడివోలను ఆదేశించారు. తాగు నీటి సమస్యలపై ప్రజల నుండి వచ్చే ఫిర్యాదుల పట్ల అధికారులు తక్షణమే స్పందించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# డ్రమ్ములకు పెట్రోలు..!

## ప్రజలకు కొరత.. వాహనాదారులకు నిరాకరణ..!



**నంద్యాల,ఏప్రిల్ 24,ప్రభాతవార్త ప్రతినిధి:** నంద్యాల పట్టణంలోని విద్యుత్ కార్యాలయం ఎదురుగా ఉన్న శ్రీ వేంకటేశ్వర ఫిల్లింగ్ స్టేషన్‌లో పెట్రోలు సరఫరాపై వివాదం నెలకొంది. ద్విచక్రవాహనాదారులకు పెట్రోలు లేదని చెప్పి పంపుతున్నారు. అదే సమయంలో ఆటోలో తీసుకు వచ్చిన డ్రమ్ములకు మాత్రం పెద్ద ఎత్తున డీజిల్, పెట్రోలు నింపి పంపుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఒక్క లీటర్ పెట్రోలు కూడా ఇవ్వకుండా ఏకంగా డ్రమ్ములకు మాత్రమే పెట్రోలు బంక్ నిర్వాహాకులు బ్లాక్ మార్కెట్ తరలిస్తున్నారని ద్విచక్రవాహానాల వారు తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఇప్పటికే పట్టణంలో లీటర్ పెట్రోలు రూ.150 నుండి రూ.200ల వరకు బ్లాక్ అమ్ముతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైన సంభందిత ఉన్నతాధికారులు స్పందించి వెంటనే పెట్రోలు బంక్ నిర్వాహాకులపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ వాహానాల దారులు డిమాండ్ చేశారు.

# మంత్రి ని మర్యాదపూర్వకంగా కలిసిన బీజేపీ జిల్లా అధ్యక్షులు అభిరుచి మధు



**నంద్యాల ఏప్రిల్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** నంద్యాల మంత్రి గారి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర న్యాయ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి వర్యులు ఎన్ఎండి ఫరూక్ గారిని బీజేపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు అభిరుచి మధు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కూటమిలో భాగంగా మిత్రపక్షాల ఐక్యతను చాటుతూ ఈ భేటీ జరిగిందని తెలిపారు . నంద్యాల జిల్లాకు సంబంధించిన పలు కీలక అభివృద్ధి పనులు, స్థానిక సమస్యలపై ఇరువురు నేతలు చర్చించారు.

# గ్రామ స్వపరిపాలనలో ప్రజలకు భాగస్వామ్యం..

: కోసిగిలో ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం



**కోసిగి, ఏప్రిల్ 24, ప్రభాతవార్త :** గ్రామ స్వపరిపాలనలో ప్రజలకు భాగస్వామ్యం కల్పించడానికి అవసరమయ్యే సంస్థాగత మార్పుల తో ఏర్పడినదే పంచాయతీ రాజ్ వ్యవస్థ అని కోసిగి గ్రామ ప్రత్యేకఅధికారి వరప్రసాద్ అన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థ దినోత్సవంలో భాగంగా శుక్రవారం స్థానిక కోసిగి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఈవోపిఆర్డి ఈశ్వరయ్య అధ్యక్షతన ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం వేడుకలను జరుపుకున్నారు. టీడీపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు, మాజీ సర్పంచ్ ముత్తారెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షులు నాడిగేని అయ్యన్నలు ముఖ్య అతిధులుగా హాజరయిన ఈ కార్యక్రమంలో ముందుగా బిఆర్.అంబేద్కర్, మహాత్మగాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లలర్పించారు. అనంతరం జరిగిన సభలో ప్రత్యేక అధికారి వర ప్రసాద్ మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యం అనే అంశాలతో మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అశోక్ మెహతా కమిటీ సిఫార్సుల ఆధారం గానే ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాష్ట్రంలో ఆనాటి ముఖ్యమంత్రి ఎన్‌టిఆర్ మండల వ్యవస్థను ప్రవేశ పెట్టగా కేంద్రంలో పీవీ నరసింహారావు నేతృత్వంలో పంచాయతీరాజ్ వ్యవస్థలకు రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించవలసిన అగత్యం ఏర్పడిందనా ్నరు. దీంతో ఈ విషయాన్ని 1991లో ఈ బిలు ్లకు సంబందించిన అన్ని బిల్లులను కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టిందనా ్నరు. దీంతో 1992లో పార్లమెంట్ ఈ బిల్లును ఆమోదించి దీనిని రాష్ట్రాల శాసనసభల ఆమోదం కోసం దేశంలోని అన్ని రాష్ట్రాలకు పంపడం జరిగిందన్నారు. దేశంలో మెజారిటీ రాష్ట్రాలు ఈ బిల్లుకు ఆమోదం తెలపగా, అప్పటి రాష్ట్రపతి శంకర్‌దయాళ్ శర్మ ఆ బిల్లుపై 1993 ఏప్రిల్ 20వ తేదిన సంతకం చేసారని తెలిపారు.. దీని ద్వారా రాజ్యాంగంలో 73వ సవరణలు చేసి ఆ బిల్లుకు రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించడం జరిగిందన్నారు. పంచాయతీలకు సంబందించి 73వ రాజ్యాంగ సవరణ 1993 ఏప్రిల్ 24వ తేది నుండి అమలులోకి వచ్చిందని వివరించారు. అప్పటి నుండి ఏప్రిల్ 24వ తేదిని పంచాయతీ రాజ్ దినోత్సవంగా జరుపుకుంటున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నూతన పంచాయతీరాజ్ చట్టం 1994 మూడంచెల వ్యవస్థ గ్రామస్థాయిలో గ్రామ పంచాయతీ దిగువ స్థాయి, మండల స్థాయిలో మండల పరిషత్, జిల్లా స్థాయిలో జిల్లా పరిషత్ మూడవ అంచెను అంటే ఎగువ స్థాయిని రాజ్యాంగంలో పొందుపరిచినట్లు తెలిపారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. నాయకులు వక్రాణి వెంకటేశ ్వరు ్ల, మాజీ ఉపసర్పంచ్ ఉసేన్ ఇంచార్జీ పంచాయతీ కార్యదర్శి రంగస్వామి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు..

## కష్టం కాదు..ఇష్టంతో పనిచేస్తే మంచి ఫలితాలు

– ప్రతిరోజు క్షేత్రస్థాయి పర్యటనలు విధిగా భావించాలి – నగరపాలక సంస్థ కమిషనర్



**కర్నూలు మున్సిపల్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:** విధులను కష్టంగా కాకుండా ఇష్టంతో పనిచేస్తే మంచి ఫలితాలు సాధ్యమవుతాయని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు అన్నారు. పనిపై అసక్తి పెంపొందించుకొని సమిష్టిగా ముందుకు సాగాలని సంస్థను అన్నిరంగాలోల అగ్రస్థానంలో నిలిపేదిశగా కృషిచేయాలని పేర్కొన్నారు. శుక్రవారం ఎస్బీఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో అధికారులు, సిబ్బందితో నిర్వహించిన ముఖ పరిచయ సమావేశంలో కమిషనర్ సూచనలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భయపెట్టి పనులు చేయించే విధానం తనదికాదని ఏవ్వరి రాని పనులు చేయమని ఒత్తిడి చేయనని స్పష్టం చేశారు. విధులకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందరు పెంపొందించుకోవాలన్నారు. పనిభారం పెరిగిన సందర్భాల్లో సమిష్టిగా కుటుంబ సభ్యుల్లా పనిచేయాలని సూచించారు. కార్యాలయానికి సమయపాలనతో హాజరవుతూ ఫైళ్లను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు క్లియర్ చేయాలని ప్రతిరోజు ఉదయం క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలకు ప్రత్యక్ష్యంగా తెలుసుకోవాలని అదేశించారు. ప్రజలకు సంబంధించిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని ఆలస్యం చేయవద్దని స్పష్టం చేశారు. అనంతరం పట్టణ ప్రణాళిక పారిశుద్ధ్య విభాగాల అధికారులతో వేర్వేరు సమావేశాలు నిర్వహించారు. సమావేశంలో అదనపు కమిషనర్ ఆర్‌జివి కృష్ణ, డిప్యూటి కమిషనర్ సతీష్‌కుమార్‌రెడ్డి, ఎస్‌ఈ రమణమూర్తి, ప్రజారోగ్య అధికారి డా.ఎం రఘు, ఇంచార్జ్ సిటిప్లానర్ వై వెంకటరమణ,ఆర్వోలు స్వర్ణలత, వాజిద్, కార్యదర్శి నాగరాజు అకౌంట్స్ అఫీసర్ పాల్గొన్నారు.

## నాయిని సావిత్రమ్మ దంపతులకు ఘనసన్మానం



**పాములపాడు, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:** గత ఐదు సంవత ్సరాలుగా జూటూరు గ్రామాభివృద్ధికి ఎన్నో సేవలు అందించిన సర్పంచ్ నాయిని సావిత్రమ్మ నాయిని మద్దిలేటి దంపతులను గ్రామప్రత్యేక అధికారి, డిప్యూటి ఎంపీడీవో తిరుపాల్, పంచాయితీ కార్యదర్శి కలాం, సచివాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ప్రత్యేక అధికారి తిరుపాలు మాట్లాడుతూ ఐదుసంవత ్సరాలు సర్పంచ్‌గా కొనసాగిన సావిత్రమ్మ కుటుంబం గ్రామానికి ఎన్నోసేవలు అందించారన్నారు. తాగునీరు, సీసీ రోడ్లు, వివిధ అభివృద్ధి పథకాలు చేసి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించారన్నారు. మండలంలోని వివిధ శాఖల అధికారులు సైతం గ్రామానికి వచ్చినప్పుడు సర్పంచ్ కుటుంబం గౌరవప్రదంగా ఆహ్వానించి భోజన సదుపాయాలు వివిధ కార్యక్రమాలు అందించేవారని వారి ఆప్యాయత అధికారులు మరువ లేనిదన్నారు. ప్రభుత్వ అభివృద్ధిలో భాగస్వాములై గ్రామాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేశారన్నారు. పదవి ఉన్నప్పుడే కాక వారి సేవలు ఎల్లవేళల ఉండాలని, ఉంటాయని ఆకాంక్షించారు. అనంతరం తిరుపాలు శానిటేషన్ కార్మికులకు ఉచితంగా బ్లౌజులు,షూస్ పంపిణిచేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాయిని కృష్ణయ్య, ఉపేంద్ర, మనోహర్, శంకర్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## నిరాశ్రయ వృద్ధులకు వస్త్ర, అన్నదానం



**ఆళ్లగడ్డ, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:** చిరంజీవి రీతిక్ జన్మదినోత ్సవం సందర్భంగా శుక్రవారం రీతిక్ తల్లిదండ్రులు రామయ్య, మానసలు ఆళ్లగడ్డలోని ప్రశాంతి ఆశ్రమంలోని వృద్ధులకు వస్త్రదానం, అన్నదానం చేశారు. అనంతరం ఆశ్రమం నిర్వాహకులు శిరోమణి, వినోద్‌లు మాట్లాడుతూ రీతిక్ ఐదవ పుట్టిరోజు సందర్భంగా మా ఆశ్రమంలోని వృద్ధులకు వస్త్రాలు అందించి, అన్నదానం చేయడం ఎంతో పుణ్యకార్యమని వారు తెలిపారు.

## నీటి నిల్వ సామార్థ్యాన్ని పెంచడమే లక్ష్యం



**కొత్తపల్లి, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:** గ్రామీణ ప్రాంతాల్లో నీటి చెరువులు, కుంటల్లో నీటి నిల్వ సామార్థ్యాన్ని పెంచడమే లక్ష్యమని ఎంపీడీవ మేరీ అన్నారు. ఆమె శుక్రవారం మండల పరిధిలోని శివపురం గ్రామపంచాయితీలో జలధార, జలహారతి పథకం కింద మంజూరైన ఉపాధి పనులను ఉపాధి హామి ఏపీవో విమలమ్మలతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ భూగర్భ జలాల సామార్థ్యం, నీటి భద్రతను బలోపేతం చేయడమే లక్ష్యంగా జలధార, జలహారతి కార్యక్రమం కింద పనులు మంజూరయినట్లు ఈ పనుల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో చెరువులు, కుంటల్లో నీటి భద్రతను పెంచి రైతుల ఆదాయాని ్న పెంచడం ప్రభుత్వ ప్రధాన ఉద్దేశ్యమన్నారు. ఈకార్యక్రమంలో ఉపాధి హామి టెకి ్నకల్ అసిసె ్టంట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

## ఘనంగా పంచాయితీరాజ్ దినోత్సవ వేడుకలు



**పాములపాడు, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:** పంచాయితీరాజ్ దినోత ్సవ వేడుకలను ఎంపీడివో చంద్రశేఖర్ ఆధ్వర్యంలో అయా గ్రామాల సచివాలయాల్లో ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లోని ప్రత్యేక అధికారులు గ్రీన్ అంబాసిడర్ల కార్మికుల సేవలను గుర్తించి వారిని సన్మానించారు. పాములపాడు మండల కే ంద్రంలో ప్రత్యే అధికారి సుభద్రమ్మ,ఎంపీడివో చంద్రశేఖర్ శానిటేషన్ కార్మికులను సన్మానించి వారి సేవలను అభినందించారు. గ్రామాలు పరిశు భ్రంగా ఉండాలంటే శానిటేషన్ కార్మికులు ముఖ్యపాత్ర పోషిస్తున్నట్లు ఆయన అన్నారు.

## పెట్రోల్, డీజిల్ కొరత లేదు



**కొత్తపల్లి, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:** గ్రామీణ ప్రాంతాల ప్రజలు పెట్రోల్, డీజిల్ ఎలాంటి అందోళన చెందవద్దని పెట్రోల్, డీజిల్ కొరత లేదని తహశీల్దార్ ఉమారాణి ప్రజలకు సూచించారు. ఆమె శుక్రవారం మండల పరిధిలోని ఎల్‌ఎస్‌గౌడ్ పె ట్రోల్ బంకును తనిఖీచేశారు. ఈతనిఖీల్లో పలు రికార్డులను పరిశీలించి డీజిల్, పెట్రోల్ నిల్వ తనిఖీచేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు అవాస్తవమని పెట్రోల్, డీజిల్ కొరతపై వాహనదారులు, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సాధారణం కంటే కొన్నిచోట్ల రద్దీ ఉండడం ద్వారా తాత్కాలికంగా నోస్టాక్ బోర్డులు పెడుతున్నారని వాహనదారులు కంగారుపడి పెట్రోల్, డీజిల్ నిల్వ చేసుకోవద్దన్నారు. సాధారణంగా అవసరాలకు మాత్రమే ఉపయోగించుకోవాలన్నారు. ఈతనిఖీల్లో ఎల్‌ఎస్ గౌడ్ పెట్రోల్ బంకు యజమాని లింగస్వామి గౌడ్ ఉన్నారు.

## పోలీసుల బందోబస్తు..!



**మహానంది, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:** పెట్రోల్, డీజిల్ కృత్రిమ కొరత ఏర్పడిన విషయం తెలిసిందే. శుక్రవారం మహానంది మండలంలోని బుక్కాపురం, గోపవరం, గాజులపల్లె పెట్రోల్ బంకులు వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ రాంమోహన్‌రెడ్డి అదేశాల మేరకు పోలీసులు బందోబస్తు నిర్వహించారు. పెట్రోల్, డీజిల్ కృ త్రిమ కొరత వల్ల పలుచోట్ల ఘర్షణలు జరుగుతుండడంతో ముందస్తు జాగ్రత _గా బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలుసో ్తంది.

## కౌతాళం సిఐ యుగంధర్ ఖాదర్ లింగస్వామి దర్శనం



**కౌతాళం, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:** కౌతాళం మండలానికి నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సిఐ యుగంధర్ శుక్రవారం శ్రీ జగద్గురు ఖాదర్ లింగస్వామి దర్గా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు. దర్గా పీఠాధిపతి పెద్ద మున్నా సాహెబ్ సిఐ యుగంధర్‌ను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలో శాంతి భద్రతలు కాపాడుతూ ప్రజలకు న్యాయం చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, దర్గా నిర్వాహకులు పాల్గొన్నారు.

## ముసలిమడుగులో జాతీయ పంచాయితీరాజ్ దినోత్సవం



**కొత్తపల్లి, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:** మండల పరిధిలోని ముసలిమడుగు గ్రామ పంచాయితీ స్వర్ణ గ్రామ కార్యాలయంలో శుక్రవారం గ్రామ ప్రత్యేక అధికారి కెపిఆర్ శర్మ జాతీయ పంచాయితీ అవిర్భావ దినోత ్సవం సందర ్భంగా గ్రామసభ నిర్వహించారు. ఈసభలో ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 24న జాతీయ పంచాయితీరాజ్ అవిర్భవించిందని ఆరోజున మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తు బిల్లును ప్రవేశపెట్టారన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని జల సంపద, వృక్ష సంపద పెంపొందించుకోవాలన్నారు. సచివాలయ పంచాయితీ కార్యదర్శి రాఘవే ంద్ర, గ్రామనాయకులు రహింఖాన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా..



**ఆళ్లగడ్డ, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:** ఆళ్లగడ్డ అసిస్టెంట్ సెషన్స్ జడ్జీ కోర్టు నూతన ఏపీపీగా నియమితులైన న్యాయవాది ఉప్పలపాటి ప్రతాప్ శుక్రవారం ఆళ్లగడ్డ నియోజకవర్గ టీడీపీ యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా తనకు ఏపీపీగా రావడానికి కృషిచేసిన భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపి ఆయనను సన్మానించారు. ఆళ్లగడ్డ ఐదవ అదనపు జిల్లా జడ్జి కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బత్తిని శివప్రసాద్‌రావు, ఆళ్లగడ్డ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు సీనియర్ న్యాయవాది రమణయ్య, న్యాయవాదులు శ్రీనివాసులు, నరసింహారెడ్డిలు పాల్గొన్నారు.

## కాలజ్ఞాన రచయిత ఆరాధన ఉత్సవాలకు తరలిరండి



**రుద్రవరం ఏప్రిల్ 24, ప్రభాతవార్త:** ఈనెల 26 ఆదివారం కాలజ్ఞాన రచయిత శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన ఉత్స వాలకు భక్తాదులందరు తరలిరావాలని ఆలయ నిర్వాహకులు ఏదుల బ్రహ్మనందరెడ్డి కోరారు. ఈసందర్భంగా శుక్రవారం ఆయన మాట్లా్డుతూ మండల కేంద్రం రుద్రవరంలోని శ్రీనందీశ్వర ఆలయంలో వెలసిన శ్రీవీర బ్రహ్మేంద్రస్వామి 14వ ఆరాధన మహోత ్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈసందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేక పూజాకార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. మండల పరిధిలోని గ్రామాల నలుమూలల నుండి ఉత్స వాలకు అధిక సంఖ్యలో భక్తులు హాజరయి స్వామివారి సేవకు పాత్రులవుదురని కోరుతున్నామన్నారు. ఆరాధన ఉత్స వాలకు హాజరయ్యే భక్తులందరికి భోజనవసతులు ఏర్పాటుచేయడం జరిగిందన్నారు.

## వేసవి శిక్షణా తరగతులు ప్రారంభం..



బనగానపల్లె, ఏప్రిల్ 24 ప్రభాత వార్త: పట్టణంలోని కస్బా ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం వేసవి శిక్షణా తరగతులు ప్రారంభించబడ్డాయి. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు, నంద్యాల జిల్లా యు.టి.ఎఫ్. సహ అధ్యక్షులు కే. సత్య ప్రకాశ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సెలవులలో విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి ఈ తరగతులు ఉపయోగపడతాయని తెలిపారు. చదవడం, రాయడంలో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు ఈ కార్యక్రమం దోహదం చేస్తుందని పేర్కొన్నారు. ఈ తరగతులు ప్రతిరోజు ఉదయం 8:30 నుండి 10:00 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు ఎస్. అబ్దుల్ కలీం, తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## వడ్డే మనోజ్ ను చంపిన వ్యక్తులను ఎన్కౌంటర్ చేయాలి

**డోన్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త :** ఓర్వకల్లు మండలం ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన వడ్డే మనోజ్ ను అతి కిరాతకంగా చంపిన వ్యక్తులను పోలీసులు ఎన్కౌంటర్ చేయాలని డోన్ వడ్డెర సంక్షేమ సంఘం అధ్యక్షులు వి నాగరాజ్ డిమాండ్ చేశారు శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ వడ్డే మనోజ్ కు 45 రోజుల క్రితం వివాహమైందని భార్యాభర్తలు ఇంటి దగ్గర ఉండగా గ్రామం చెందిన కొందరు వచ్చి మనోజ్ పై విచక్షణ రహితంగా కత్తితో దాడి చేస్తుండగా భార్య అడ్డుకోబోగా భార్యను కూడా తోసేసి కళ్ళ ముందర భర్తను ముందరే చంపేశారని ఆమె పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు వడ్డే మనోజ్ ను చంపిన వ్యక్తులను జిల్లా బహిష్కరణ చేసి ఎన్కౌంటర్ చేయాలని మరొకసారి వడ్డెర్లపై దాడులు చేస్తే ఎన్కౌంటర్ జరుగుతాదని ప్రజలకు తెలియాలని డిమాండ్ చేశారు.

## జిల్లా స్థాయి శావ్ బాక్సింగ్ లీగ్స్ పోటీలు



**కర్నూల్ స్పోర్ట్స్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త :** స్థానిక అథారిటీ స్టేడియంలో శుక్రవారం ఉదయం జిల్లా స్థాయి శావ్ బాక్సింగ్ లీగ్స్ జూనియర్ అండర్ 15 మరియు అండర్ 19 విభాగాలలో బాక్సింగ్ పోటీలు నిర్వహచారు శావ్ లీగ్స్ బాక్సింగ్ పోటీలలో 34 మంది క్రీడాకారులు ఇందులో పాల్గొన్నారు ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 28 నుండి 30 ఏప్రిల్, 2026 తేది వరకు విశాఖ పట్నం జిల్లాలో జరగబోయే రాష్ట్ర స్థాయి శావ్ బాక్సింగ్ లీగ్స్ పోటీలలో పాల్గొంటారు. బి. భూపతి రావు, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి, కర్నూలు, జిల్లా బాక్సింగ్ సంఘం కార్యదర్శి పి. విజయకుమార్, బాక్సింగ్ ఉపాధ్యక్షుడు సునిల్ కుమార్, పాల్గొని పోటీలు ప్రరిమబించారు కార్యక్రమంలో అవినాష్,డా.రుద్రరెడ్డి, కోచలు నరేంద్ర,బాలాజీ రెడ్డి, క్రీడా సంఘము ప్రతినిధులు, కరాటే వెంకటేష్, తేజ , ఇతర సంఘాల ప్రతినిధులు, శిక్షకులు, సిబ్బంది, సీనియర్ క్రీడాకారులు మరియు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాగానే..
## కుట్టు మిషన్లను అందజేస్తాం..



**వెల్దుర్తి, ఏప్రిల్ 24, ప్రభాతవార్త :** కర్నూలు జిల్లా బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో, వెల్దుర్తి సచివాలయం 1 లో శుక్రవారం బేసిక్ టైలరింగ్ ట్రైనింగ్ ప్రోగ్రాం కు సంబంధించిన పరీక్షలు నిర్వహించారు. ఈ శిక్షణ కేంద్రం నుంచి బ్యాచ్ 1లో 70 మంది మ్యాపింగ్ కాగా 65మంది అర్హులయ్యారు. బ్యాచ్ 2లో 64 మంది మ్యాపింగ్ కాగా 56 మంది మహిళలు అర్హులు అయ్యారు. వీరికి పరీక్షలు నిర్వహించారు. కర్నూలు జిల్లా బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ యస్.జాకీర్ హుస్సేన్ పరీక్షల కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసి మహిళలు రాస్తున్న పరీక్షలను పరిశీలించి తగు సూచనలు చేశారు. బీసీ కార్పొరేషన్ ఈడీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాగానే శిక్షణ పొంది పరీక్షలు రాసిన మహిళలకు త్వరలోనే కుట్టు మిషన్లను ఉచితంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. కర్నూలు జిల్లా బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ యస్.జాకీర్ హుస్సేన్, ఈఓ నాగరాజు, ట్రైనర్లు విష్ణువర్ధిని, సునీత, రాష్ట్ర స్కిల్ డెవలప్మెంట్ అసెసర్లు రేష్మ, ప్రియదర్శిని, కర్ద్ ఏజెన్సీ కోఆర్డినేటర్ దీవన్న, పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ పంచాయితీరాజ్ దినోత్సవం



**కౌతాళం, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:** కౌతాళం మండలంలోని ఎరిగేరి గ్రామపంచాయతీలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సభను ఏర్పాటు చేసి గ్రామాభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, ప్రజల సమస్యలపై విస్తృతంగా చర్చించారు. గ్రామస్థుల అభిప్రాయాలను తెలుసుకుని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. అలాగే గ్రామంలో ఎలక్ట్రిక్ (ఈవీ) ఆటోను ప్రారంభించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా కాలుష్యాన్ని తగ్గించే లక్ష్యంతో ఈ వాహనాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో పి. గోపాల్ పాల్గొన్నారు. తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు సురేష్ నాయుడు ఎలక్ట్రిక్ ఆటోను ప్రారంభించారు. సతీష్ నాయుడు, సెక్రటరీ యోగేశ్వర్ రెడ్డి, రామలింగ, బసవరాజ్, వీరేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## శతాబ్దాల చరిత్రతో మెరిసే..బంగినపల్లి..మామిడిపండ్లు..!

**(మొదటి పేజీ తరువాయి ) :** బంగనపల్లెకు ప్రపంచస్థాయి గుర్తింపును తీసుకొచ్చింది. దేశం నలుమూలల నుంచి మాత్రమే కాకుండా విదేశాల నుంచి కూడా బంగనపల్లి మాడిపండ్లకు డిమాండ్ పెరుగుతోంది. వినియోగదారులు నేరుగా తోటలకు వెళ్లి పండ్లు కొనుగోలు చేయడం, వ్యాపారస్తులు ముందుగానే ఆర్డర్లు ఇవ్వడం సాధారణంగా మారింది. ఈ గిరాకీతో స్థానికంగా ఉపాధి అవకాశాలు విస్తరిస్తున్నాయి. మామిడి తోటల రైతులు సంవత్సరం పొడవునా కష్టపడి పండించిన పంటను వేసవిలో మార్కెట్‌కు తీసుకువస్తారు. మాడిపండ్లకు ఉన్న గిరాకీ కారణంగా రైతులు మంచి లాభాలు పొందే అవకాశముంది. ఈ ఏడాది వాతావరణం కొంత అనుకూలంగా ఉండటంతో పంట సగటు స్థాయిలో ఉందని రైతులు చెబుతున్నారు. ఇటీవలి కాలంలో కొంతమంది వ్యాపారస్తులు మామిడి పండ్లను సహజంగా పాకానికి రాకముందే రసాయనాలు, లిక్విడ్లు ఉపయోగించి త్వరగా పండించి మార్కెట్‌లోకి తీసుకువస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విధంగా పండించిన పండ్లలో సహజ రుచి తగ్గిపోవడమే కాకుండా ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇది బంగనపల్లి మాడిపండ్ల ప్రతిష్ఠకు మచ్చ తెచ్చే ప్రమాదంగా మారుతోంది. సహజంగా పండించిన మాడిపండ్లకు సరైన ధర దక్కకపోవడం రైతుల్లో అసంతృప్తిని కలిగిస్తోంది. మధ్యవర్తుల ఆధిపత్యం, నిల్వ సౌకర్యాల కొరత, మార్కెట్ అస్థిరత రైతులకు ప్రధాన సమస్యలుగా మారాయి. నాణ్యమైన పండ్లకు ప్రాధాన్యం ఇవ్వాలని, తమ శ్రమకు తగిన విలువ దక్కాలని రైతులు కోరుతున్నారు. మామిడి మార్కెట్‌లో నాణ్యతను కాపాడటానికి అధికారులు కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. రసాయనాల వినియోగాన్ని అరికట్టడం, తనిఖీలు పెంచడం, రైతులకు అవగాహన కల్పించడం ద్వారా మాడిపండ్ల అసలు ప్రత్యేకతను కాపాడాలని నిపుణులు సూచిస్తున్నారు. ఆన్‌లైన్ విక్రయాలు, నేరుగా వినియోగదారులకు సరఫరా, ఎగుమతుల విస్తరణ వంటి మార్గాలు రైతులకు కొత్త అవకాశాలను తెరవుతున్నాయి. సరైన మార్కెటింగ్, నిల్వ సౌకర్యాలు పెంచితే బంగనపల్లి మాడిపండ్లు ప్రపంచ మార్కెట్‌లో మరింత స్థిరపడే అవకాశముంది. బంగనపల్లి బెనిషన్ మామిడిపండ్లు కేవలం ఒక పండు మాత్రమే కాదు – అది శతాబ్దాల సంప్రదాయం, ప్రాంతీయ గౌరవం, ప్రపంచానికి పరిచయం చేసిన తీపి గుర్తింపు. నవాబుల కాలం నుంచి కొనసాగుతున్న ఈ తోటల వారసత్వం నేటికీ రైతుల శ్రమతో జీవిస్తోంది. కృత్రిమ పద్ధతులను అరికట్టి, సహజంగా పండిన మాడిపండ్లకు ప్రాధాన్యం ఇస్తేనే బంగనపల్లి మామిడి భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకుంటుంది.

## పెట్రోల్ డీజిల్.. కొరత..!

**(మొదటి పేజీ తరువాయి ) :** ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (వీది) వంటి చమురు సంస్థలు గతంలో ఒక్కో బంకుకు పూర్తి ట్యాంకర్ సరఫరా చేయగా, ప్రస్తుతం 4 వేల లీటర్ల ట్యాంకర్‌ను నాలుగు బంకులకు పంచుతున్నట్లు బంకు యజమానులు వెల్లడిస్తున్నారు. అంతేకాకుండా గతంలో అమలులో ఉన్న వారం రోజుల క్రెడిట్ సౌకర్యాన్ని నిలిపివేసి, కేవలం నగదు చెల్లింపులకే సరఫరా పరిమితం చేయడం వల్ల చిన్న బంకుల యజమానులు ఆర్థిక ఒత్తిడికి గురవుతున్నారు. ఈ నేపథ్యంలో పెట్రోల్ బంకు యజమానులు రాష్ట్ర స్థాయి అధికారులతో సమావేశమై సమస్యలను వివరించారు. సరఫరా సక్రమంగా లేకపోవడం, డిమాండ్ ఒక్కసారిగా పెరగడం ప్రధాన కారణాలుగా పేర్కొన్నారు. ఇటీవల ఇతర రాష్ట్రాల్లో ఎన్నికల అనంతరం డీజిల్ ధరలు పెరుగుతాయనే వదంతులు వ్యాపించడంతో ప్రజలు ముందస్తుగా ఇంధనం నిల్వ చేసుకునేందుకు పరుగులు పెట్టడం కూడా కొరతకు ఒక కారణంగా భావిస్తున్నారు. దీంతో డిమాండ్ ఒక్కసారిగా పెరిగి సరఫరా వ్యవస్థపై ఒత్తిడి పెరిగింది. కొంతమంది బంకు యజమానులు డీజిల్ నిల్వ ఉంచుకుని విక్రయించకుండా బ్లాక్ మార్కెటింగ్ చేస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఈ విషయంపై సంబంధిత అధికారులు విచారణచేపట్టాల్సిన అవసరంఉందని ప్రజలు కోరుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుని సరఫరాను పెంచి, బంకుల్లో సమృద్ధిగా ఇంధనం అందుబాటులో ఉండేలా చూడాలని రైతులు, వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు. లేదంటే వ్యవసాయ పనులు, రవాణా సేవలు మరింత దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వివరణ పెట్రోల్ డీజిల్ కొరతపై డిఎస్ఓ రాజా రఘువీర్ ను ప్రభాతవార్త వివరణ కోరగా.. ఆయిల్ కంపెనీల సరఫరాలో కొంత ఇబ్బందులు ఉన్నాయన్నారు. ఆ విషయాలపై రాష్ట్రస్థాయిలో వ్యాపారులకు ఆయిల్ కంపెనీల యజమాలతో అధికారులు చర్చలు జరిపారన్నారు. ఒకటి రెండు రోజులలో పరిస్థితి చక్కబడుతుం దన్నారు ఎప్పటిలాగే పెట్రోల్ డీజిల్ అందుబాటులోకి వస్తాయని రాజా రఘువీర్ వివరణ ఇచ్చారు.

## గ్రామాభివృద్ధే దేశ అభివృద్ధికి మూలం..



**చిప్పగిరి, ఏప్రిల్ 24, ప్రభాతవార్త :** గ్రామసభే గ్రామ అభివృద్ధికి పునాది, గ్రామ అభివృద్ధి దేశ అభివృద్ధికి మూలమని చిప్పగిరి ఎంపీడీవో అల్లాబకాష్, కార్యాలయ ఏవో శ్రీనివాసులు, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన చిప్పగిరిలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. గ్రామాల అభివృద్ధి చెందాలంటే ముఖ్యంగా గ్రామ పంచాయతీల ద్వారానే సాధ్యమన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తే అభివృద్ధి మూడింతలు ముందుకెళుతుందన్నారు. లేకపోతే సమన్వయ లోపంతో గ్రామ అభివృద్ధి కుంటుపడుతుందన్నారు. మన గ్రామం, మన బాధ్యత, మన భవిష్యత్ అనే నినాదంతో ప్రతి యొక్క పౌరుడు భాగస్వామ్యంతో సమగ్ర గ్రామ అభివృద్ధి సాధిద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రాంబ్రహ్మం, జూనియర్ అసిస్టెంట్ సంజీవ్, పంచాయతీ కార్యదర్శులు సిసింద్రీ, హరిబాబు, అస్పిరేషనల్ బ్లాక్ ఫెలో లక్ష్మీ నరసింహ, టెక్నికల్ అసిస్టెంట్లు మారుతి, రమేష్, రాంప్రసాద్, రామాంజనేయులు, శర్మాస్ వలి, చిప్పగిరి ఫీల్డ్ అసిస్టెంట్ శేఖర్, నాగేంద్ర, కంప్యూటర్ ఆపరేటర్ యాసిన్ ఖాజా పాల్గొన్నారు.

## జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం..



**చాగలమర్రి, ఏప్రిల్ 24, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన చాగలమర్రిలోని ఎంపీడీవో కార్యాలయ సభా భవనంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా ఎంపీడీవో తాహిర్ హుస్సేన్ ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, మహాత్మా గాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మండల పంచాయతీరాజ్ ఇంజనీర్ కొండారెడ్డి, మండల ఇరిగేషన్ అధికారి హుస్సేన్, జూనియర్ అసిస్టెంట్ బషీర్, మండల కోఆర్డినేటర్ రాజ్ కుమార్, సచివాలయ సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉత్తమ పంచాయతీ కార్యదర్శిగా ఆదినారాయణ ఎంపిక



**చాగలమర్రి, ఏప్రిల్ 24, ప్రభాతవార్త :** మండల పరిధిలోని శెట్టివీడు గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న ఆదినారాయణ జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా ఉత్తమ కార్యదర్శిగా ఎంపిక కావడం జరిగింది. ఈ సందర్భంగా శుక్రవారం ఎంపీడీవో కార్యాలయం లో నారాయణను సత్కరించారు. గ్రామంలో వివిధ అభివృద్ధి పథకాలను అమలుపరుస్తూ ప్రభుత్వ నియమ నిబంధనలు మేరకు విధులు నిర్వహిస్తున్న ఆదినారాయణ మరిన్ని ప్రశంస పత్రాలను అందుకోవాలని పలువురు కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో తాహిర్ హుస్సేన్, పిఆర్ ఇంజనీర్ కొండారెడ్డి, సచివాలయ సిబ్బంది ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

## నూతన తహసిల్దార్ ను సన్మానించిన వీఆర్వోలు, విఆర్ఏలు



**చిప్పగిరి, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:** చిప్పగిరి మండల నూతన తహసిల్దార్ గా పదవీ బాధ్యతలు స్వీకరించిన మురళీమోహన్ ను వీఆర్వోలు, వీఆర్ఏలు ఘనంగా సన్మానించారు. శుక్రవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయం నందు నూతన తాహసిల్దార్ మురళీమోహన్ కు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఆలూరు సిఎస్డిటి గా పనిచేస్తూ కర్నూల్ కలెక్టరేట్లో డిప్యూటేషన్ పై విధులు నిర్వహిస్తున్న మురళీమోహన్ ను ఇటీవల తహసిల్దార్ల పదోన్నతిలో భాగంగా చిప్పగిరి రెగ్యులర్ తాహసిల్దార్ గా బదిలీపై వచ్చారు. గతంలో ఉన్న ఇన్చార్జ్ తహసిల్దార్ ఎజాజ్ అహ్మద్ ఇక్కడే డిప్యూటీ తహసిల్దార్ గా కొనసాగుతున్నారు. ఆర్ఐ సునీత, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు రామాంజనేయులు, వీరేష్, వీఆర్వోలు మల్లికార్జున పీఎం గోవిందప్ప, చంద్ర నాయక్, పెద్దన్న, ఆంజినేయులు, వన్నూరు పాల్గొన్నారు. వీఆర్ఏలు నూతన తాహసిల్దార్ ను పూలమాలవేసి శాలవాళ్లతో సన్మానించారు.

## ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ



**వెల్దుర్తి, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:** వెల్దుర్తి మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో రైతు సాధికార సంస్థ ఆధ్వర్యములో రైతు సేవ కేంద్రం సిబ్బందికి మరియు ప్రకృతి వ్యవసాయం సిబ్బందికి ప్రకృతి వ్యవసాయంపై శుక్రవారం శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. పత్తికొండ డివిజన్ సహాయ సంచాలకులు శ్రీ మోహన్ విజయకుమార్ హాజరై మాట్లాడుతూ ఈ సంవత్సరం ఎల్ ని నో ప్రభావం ఉంటుంది రైతులకు అధిక నీటి వసతి కావాల్సిన పంటల వైపు మొగ్గు చూపకుండా అవగాహన కల్పించాలని తెలియజేసారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో నవధాన్యాలు సాగు రైతులతో చేయించాలని తెలియజేసారు. వెల్దుర్తి మండల వ్యవసాయ అధికారి అక్బర్ బాషా గారు మాట్లాడుతూ ప్రతి ఆర్ ఎస్ కె పరిధిలో ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ రైతులతో చేయించి భూసారాన్ని పెంపొందించాలని సిబ్బందికి తెలియజేయడం జరిగినది. ఎఫ్ఎం టిలు పరమేశ్వరుడు, మునిరాజు విత్తన గుళికలు తయారు చేయు విధానము గురించి వివరించారు. రామకృష్ణారెడ్డి కషాయాల తయారీ గురించి క్షుణ్ణంగా తెలిపారు. ఈ కార్యక్రమానికి పత్తికొండ ఏ డి ఏ విజయ్ కుమార్ గారు మండల వ్యవసాయ అధికారి అక్బర్ భాష గారు ఏఈవో అజయ్, రైతు సేవ కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మే 26న శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మవ్వ దేవర మహోత్సవం



– ఏర్పాట్లు చేస్తున్న ఆలయ ప్రధాన పూజారి ముత్యాల గంగరాజుస్వామి – శ్రీ ముత్యాలమ్మకు ఘనంగా వారపు పూజలు

**మద్దికెర, ఏప్రిల్ 24, ప్రభాతవార్త ;** గుంతకల్ జి.కొట్టాల గ్రామంలో వెలిసిన భక్తుల ఆరాధ్య దైవమైన శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మవ్వ దేవర మహోత్సవాన్ని మే నెల 26వ తేదీన ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ప్రధాన పూజారి ముత్యాల గంగరాజుస్వామి శుక్రవారం తెలిపారు. ప్రతియేటా ఘనంగా దేవర మహోత్సవాన్ని చేపడతామన్నారు. కోరికలు నెరవేరిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి అమ్మవారి ఊరేగింపులో పాల్గొంటారన్నారు. వచ్చిన భక్తులకు మే 26న ఆలయ ఆవరణలో అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. దేవర మహోత్సవంలో పాల్గొనే భక్తులకు వసతి, తాగునీరు, అన్నదానం తదితర సౌకర్యాలను కల్పిస్తున్నట్లు తెలిపారు.

**– శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మవ్వకు ప్రత్యేక పూజలు :** శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మవ్వకు మంగళవారం వారపు పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కోరికలు నెరవేరిన వారు బోనాలలతో అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఆలయ నిర్వాహకులు, పూజారి ముత్యాల గంగరాజుస్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. భక్తుల రాకతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఆలయ నిర్వాహకులు, పూజారి ముత్యాల గంగ రాజుస్వామి మాట్లాడుతూ ఆది, మంగళ, శుక్రవారాల్లో ముత్యాలమ్మవ్వ వారికి భక్తుల సమక్షంలో ప్రత్యేక పూజలు నిర్వ హిస్తామని తెలిపారు. కోరికలు నెరవేరిన భక్తులు ఆలయం వద్ద అమ్మవారికి బోనాలతో ప్రసాదం సమర్పి స్తారని, ఒడిబియ్యంతో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తారని చెప్పారు. భక్తుల ఆరాధ్య దైవంగా, పిలిస్తే పలికే తల్లిగా శ్రీ ముత్యాలమ్మవ్వ వెలుగొందుతున్నారని తెలిపారు.

## పెట్రోల్ బంకుల దగ్గర వాహనదారుల నిరీక్షణ..!



**కోడుమూరు,ఏప్రిల్ 24, ప్రభాతవార్త :** పెట్రోల్,డిజిల్ సరఫరా గణనీయంగా తగ్గి పోవడంతో కోడుమూరు పట్టణంలో ఉన్న పెట్రోల్ బంకులల్లో నిల్వలు అడుగంటాయి. దీంతో వాహనదారులు పెట్రోల్, డిజిల్ కోసం పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీకావు. వాటి కోసం బంకుల దగ్గర పెట్రోల్, డిజిల్ కోసం వాహనదారులు బారులు దీరుతున్నారు. ఇది వరకు బంకులకు అందించే సరఫరాలో భారీగా కోతలు విధించడంతో బంకుల దగ్గర ఇంధన సమస్యలు తీవ్రమయ్యాయి. ఒక్కొక్క బంకులకు మూడు రోజులకోసారి సరఫరా చేస్తున్న దంతో వాహనదారుల సమస్యలు తీరడం లేదని వాపోతున్నారు. దీంతో బంకు నిర్వాహకులు వాహనదారులకు సరిపడే విధంగా పెట్రోలను సమృద్ధిగా అందించలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. దీంతో అరకొరగా అందిస్తున్న సరఫరాతో బంకుల దగ్గర వాహనాలు క్యూకట్టుతున్నాయి. మరికొన్ని బంకులు నోస్టాక్ బోర్డులతో మూసుకుంటున్నాయి. పట్టణంలో ఐదు పెట్రోలు బంకులు ఉన్నాయి. కోడుమూరు సమీపంలో ఉన్న పెట్రోల బంకుల దగ్గర కూడా ఇవే సమస్యలు ఉండడంతో వాటి కోసం వాహనదారులు పడే పాట్లు అన్నీ ఇన్నీ కావు. అంతటా ఇదే పరిస్థితి నెనకొనడంతో ఇటు వాహనదారులు, రైతులు పడుతున్న పాట్లు అన్నీ ఇన్నీకావు. ఇది ఇలా ఉంటే కొంత మంది బంకుల యాజమాన్యం ఇదే అదునుగా చేసుకొని అరకొరగా అందే నిల్వలను కృతిమ కొరతను సృష్టించి సొమ్ము చేసుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏది ఎమైన గత వారంరోజుల నుంచి పెట్రోల్, డిజిల్ సమస్యలు తీవ్ర కావడంతో వాహనదారులకు ఏర్పడే ఇబ్బందులు ఇంకా ఎన్నిరోజులు పడుతాయని బంకు యాజమన్యాలను నిలదీస్తున్నారు.ఇలా పెట్రోల్, డిజిల్ సమస్యలతో వాహనదారులతో పాటు రైతులు కూడా తీవ్ర ఇబ్బందులకు గురిఅవుతున్నారు. ఈ సమస్యలను ఇప్పటికైనా తీర్చక పోతే వాహనదారులు రోడ్కెక్కాల్సిన పరిస్థితులు ఉన్నాయి.

## పందులు స్వైర విహారం- ఆందోళనలో జనం



**జూపాడుబంగ్లా, ఏప్రిల్ 24, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన జూపాడుబంగ్లాలో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. నిత్యం పందులు, పంది పిల్లలతో కలిసి రోడ్లపై తిరుగాడుతున్నాయి. ఉదయం నుంచి రాత్రి వరకు పందులు రోడ్లపై, జనవాసాల చూట్టూ సంచరిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఇంటి పెరటిలో ఉన్న ఆకుకూరలు, పూల మొక్కలను పాడు చేస్తూ పరిసరాలను అశుభ్రపరుస్తున్నాయి. వీటి ఛేష్టలతో మహిళలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో గ్రామంలో పందుల సంచారం వల్ల ప్రజలు పలు వ్యాదుల బారిన పడే అవకాశం ఉందని భయాందోళనకు గురవుతున్నారు. పందుల సంచారం కారణంగా పిల్లలకు మెదుడు వాపు వంటి వ్యాదులు వచ్చే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పందులు విచ్చలవిడిగా రోడ్లపై తిరుగుతుండడంతో ద్విచక్ర వాహనదారులు పలుసార్లు ప్రమాదాల బారిన సంఘటనలున్నాయి. పందులు రోడ్లపై పరుగులు తీస్తూ ద్విచక్ర వాహనదారులకు అడ్డుగా రావడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడి క్షతగాత్రులుగా మారుతున్నారు. గ్రామ పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని జనం గగ్గోలు పెడుతున్నారు. అధికారులకు ఎన్ని సార్లు విన్నవించినప్పటికి నిమ్మనీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు.పందులు పెంపకాలు చేపడుతూ పందులను విచ్చలవిడిగా జనవాసాల్లోకి వదిలేస్తూ ప్రజారోగ్యానికి కీడు చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి పందులు పెంపకందారులపై తగిన చర్యలు తీసుకుని పందుల నివారణ చర్యలు చేపట్టాలని గ్రామ ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

## ఈ నెల 27న ఫర్టిలైజర్స్‌ఫెస్టిసైడ్స్ దుకాణాలు బంద్

**నందికొట్కూరు, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:** ఈ నెల 27న వ్యవసాయ రంగానికి సంభంధించిన కీలక సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళే లక్ష్యంతో నందికొట్కూరు సబ్-డివిజన్ వ్యాప్తంగా 27న ఒక రోజు దుకాణాలు సంపూర్ణ బంద్ నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుజ్జుల గౌరీశ్వరనాయుడు తెలిపారు. శుక్రవారం బంద్‌పై వ్యవసాయశాఖ ఏడిఏ వినతి పత్రం అందజేశారు. అత్యవసర పరిస్థితుల్లో రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా తగిన చర్యలు తీసుకుంటామని అవసరమైనా సేవలను అంధించేందుకు సిద్ధంగా ఉంటామని ఆయన తెలిపారు.

## త్రాగునీటి సమస్య లేదని నిరూపించగలరా..?



**ఆలూరు,ఏప్రిల్ 24,ప్రభాతవార్త:** నియోజకవర్గంలో త్రాగునీటి సమస్య లేదని నిరూపించగలరా అంటు టీడిపి నాయకులకు వైసిపి సమాచార హక్కు చట్టం విభాగం జిల్లా ఉపాధ్యాక్షులు కొట్టాల రాజు సవాల్ విసిరారు. శుక్రవారం స్తానిక ప్రభుత్వ అతిథి గృహంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతు ఇటీవల నీటి సమస్య గురించి ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి అంబేద్కర్ సర్కిల్‌లో మహిళలతో కలిసి ధర్నా చేపట్టారన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులు నీటి సమస్య లేదని చెప్పడం సరికాదని, నీటి ఇబ్బందులు తెలిపేందుకు కొట్టాల నుంచి దాదాపు 100 మంది వచ్చారని, ప్రజలకు మద్దతుగా ఎమ్మెల్యే పాల్గొన్నారని, అబద్దాలు చెప్పడం టిడిపి నాయకులు మానుకోవాలని, ఎమ్మెల్యేను అసెంబ్లీకి పోవాలని చెబుతున్నారని, మేము అసెంబ్లీకి పోతాం అది ప్రతిపక్ష హోదా ఇస్తేనే పోయి ప్రజా సమస్యలపై గళం విప్పుతామని దీనిపై మా నాయకుడు మాజీ ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహన్‌రెడ్డి స్పష్టంగా చెప్పారని, దాని కొరకే మీడియా ద్వారా ప్రజా సమస్యలు తెలియజేస్తున్నామని ఆయన తెలిపారు. ఆలూరు ఎమ్మెల్యే నిత్యం ప్రజల మద్యనే ఉంటారని, ఎం.కొట్టాలలో సిసి రోడ్లు వేశామని చెబుతున్నారు అవి గత వైసిపి ప్రభుత్వంలోనే సిసిరోడ్లు,న హెల్త్ సెంటర్, సచివాలయ భవనం మంజూరు అయ్యాయని, ఎన్నికల కోడ్ రావడంతో నిలిచి పోయాయని, కూటమి నాయకులు మేము వచ్చి వేశామని గొప్పలు చెప్పుకొంటున్నారని ఆయన విమర్శించారు. వైసిపి మండల కన్వీనర్ మల్లికార్జున, జిల్లా నాయకులు భాస్కర్‌నాయుడు, వార్డు మెంబర్ వరుణ్, రాజు, సోము, మైనార్టీ నాయకులు గౌస్ పాల్గొన్నారు.

## ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాభివృద్ధి సాధ్యం

**తుగ్గలి,ఏప్రిల్ 24,ప్రభాతవార్త:** గ్రామంలో ప్రజలందరూ సమిష్టిగా భాగస్వామ్యులైనప్పుడే గ్రామభివృద్ధి సాధ్యమవుతుందని పంచాయితీ ప్రత్యేక అధికారి శ్రీహరి తెలిపారు. మండల పరిధిలోని పగిడిరాయి గ్రామంలోని సచివాలయం నందు గ్రామ పంచాయితీ సెక్రటరీ రాజు నాయక్ ఆధ్వర్యంలో జాతీయ పంచాయితీరాజ్ దినోత్సవం పురస్కారించుకొని శుక్రవారం ప్రత్యేక గ్రామ సభ నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతు గ్రామంలో పర్యావరణ పరిరక్షణ, పరిసరాల పరిశుభ్రతకు ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. పరిశుభ్రతను ప్రతి ఒక్కరు తమ సామాజిక భాధ్యతగా గుర్తించాలని అప్పుడే ఆరోగ్యకరమైన సమాజం సాధ్యమని సూచించారు. స్వచ్ఛతను పెంపొందించేందుకు ప్రతి ఒక్కరు నడుము బిగించాలని ఆయన పిలుపు నిచ్చారు. ప్రభుత్వ సేవలపై వచ్చే ఐవీఆర్ఎస్ పోన్ కాల్స్ ప్రాధాన్యత గురించి గ్రామంలో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించి, ప్రబుత్వం నుంచి అందుతున్న పథకాలు ప్రజలకు అందుతున్న సేవలపై అభిప్రాయాలను ఫోన్ కాల్స్ ద్వారా తెలియజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## రోఖియాబి దర్గాలో భువనేశ్వర్‌రెడ్డి ప్రత్యేక ప్రార్థన



**వెలుగోడు,ఏప్రిల్ 24,ప్రభాతవార్త:** పట్టణంలోని రోఖియా బి ఉరుసు సంధర్భంగా దర్గాలో శ్రీశైలం నియోజకవర్గం వైసిపి నాయకులు శిల్పా భువనేశ్వర్‌రెడ్డి తమ పార్టీ నాయకులతో కలిసి దర్గాలో ప్రత్యేక ప్రార్థన చేశారు. ఈ సంధర్భంగా దర్గా కమిటీ భువనేశ్వర్‌రెడ్డిని దర్గా సాంప్రదాయ దుస్తులతతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతు రోఖియాబి దువాతో పట్టణ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి లాలం రమేష్, అంబాల ప్రభాకర్‌రెడ్డి, దేశం తిరుపంరెడ్డి, ఇలియాస్‌ఖాన్, షంషీర్‌ఆలీ, సయ్యద్ షాషాఖాద్రి, రామకృష్ణ, ఖాదర్‌వలీ, ఇలియాస్ , జె.వలి పాల్గొన్నారు.

## స్వర్గీయ భూమా శోభ నాగిరెడ్డి 12వ వర్ధంతి వేడుకలు

**కర్నూలు ఏప్రిల్ 24, ప్రభాతవార్త;** స్వర్గీయ భూమా శోభ నాగిరెడ్డి 12వ వర్ధంతి వేడుకలు కర్నూలు నగరంలో అత్యంత వైభవోపేతంగా చేపట్టినట్లు ఎన్.బి.కె, మోక్షజ్ఞ సేవా సమితి ప్రతినిధులు సూరి, ప్రతాప్ లు సంయుక్తంగా తెలిపారు. స్థానిక మోర్య ఇన్ సర్కిల్ నందు శోభా నాగిరెడ్డి చిత్రపటానికి పూల మాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఎన్.బి.కె , మోక్షజ్ఞ సేవా సమితి ఆధ్వర్యంలో కర్నూలు, నంద్యాల, ఆదోని, అనంతపురం, బాపట్ల, అద్దంకి, శ్రీకాకుళం తో పాటుగా మరో 8 ప్రాంతాల్లో పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు. ప్రతి సంవత్సరం మంచు మనోజ్ కర్నూలు నగరంలో రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేసిన విషయాన్ని వారు గుర్తు చేశారు. అది కూడా సినీ హీరో బాలయ్య బాబు పై ఉన్న అభిమానంతోనే చేశారని చెప్పారు. అందులో భాగంగానే అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు వారు స్పష్టం చేశారు.

## పెండేకల్ కార్యదర్శి గోపాల్ కు ఉత్తమ సేవా అవార్డు



**తుగ్గలి,ఏప్రిల్ 24,ప్రభాతవార్త:** మండల పరిధిలోని పెండేకల్ పంచాయితీ కార్యదర్శి గోపాల్ జిల్లా స్థాయి ఉత్తమ గ్రామ పంచాయితీ కార్యదర్శి అవార్డు అందుకున్నారు.శుక్రవారం పంచాయితీ రాజ్ దినోత్సవం సంధర్భంగా జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో జడ్పీచైర్మన్ పాపిరెడ్డి, సీఈవో రమణారెడ్డి, డీపిఓ భాస్కర్ చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారు. గ్రామంలో పారశుద్యం, తాగునీరు, పచ్చదనం వంటి అభివృద్ధి పనులను పారదర్శకంగా అమలు చేసినందుకుగాను ఆయన ఈ గౌరవం దక్కింది. అధికారులు, ప్రజాప్రతినిధులు అవార్డు గ్రహీత గోపాల్‌ను అభినంధించారు.గ్రామాభివృద్ధికి మరింత కృషి చేస్తానని ఆయన తెలిపారు.

## ప్రమాదాల నివారణపై మాక్ డ్రిల్



**నంద్యాల, ఏప్రిల్ 24, ప్రబాతవార్త ప్రతినిధి:** ఈ నెల 30వ తేదీన నంద్యాల పట్టణంలోని ఎస్‌పివై ఇండస్ట్రీస్ లిమిటెడ్‌నందు ప్రమాదాల నివారణపై మాక్ డ్రిల్ నిర్వహించడం జరుగుతుందని జిల్లా రెవిన్యూ అధికారి రాము నాయక్ తెలిపారు. శుక్రవారం విజయవాడ సచివాలయం నుంచి డిజాస్టర్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ ప్రకర్‌జైన్ ప్రమాదాలు సంభవించినప్పుడు వాటిని ఎదుర్కోనేందుకు రెవిన్యూ, పోలీసు, ఇతర శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి డిఆర్‌ఓ రామునాయక్ పోలీసు అధికారులు పాల్గొన్నారు. ఈ సంధర్భంగా డిఆర్ఓ రామునాయక్ మాట్లాడుతు ప్రకృతి వైపరిత్యాల వలన అనుకోని సంఘటనలు జరిగినప్పుడు వాటిని ధైర్యంగా ఎలా ఎదుర్కోవాలి అనే అంశాలకు సంభధించి ఈ నెల 30వ తేదీన మాక్ డ్రిల్ కార్యక్రమం జరుగుతుందన్నారు. భారీ వర్షాలు, వరదలు, అగ్ని ప్రమాదాలు తదితర విపత్తుల నుండి సంరక్షించుకునేందుకు తీసుకోవలసిన అంశాలపై అవగాహన కల్పించడం జరుగుతుందని ఆయన తెలిపారు. జిల్లాలోని అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గోని మాక్ డ్రిల్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన తెలిపారు.

## అంగన్‌వాడీలకు సెన్సెస్ డ్యూటీలు వేయరాదు



**మంత్రాలయం, ఏప్రిల్ 24, ప్రభాతవార్త;** అంగన్‌వాడీలకు సెన్సెస్ డ్యూటీలు, బీఎల్‌వో డ్యూటీలు వంటి అదనపు పనులను అప్పగించరాదని సీఐటీయూ నాయకులు జయ రాజు, అంగన్‌వాడీ టీచర్లు భీమేశ్వరి, విశాలాక్షి, ద్రాక్షాయని, స్వప్న డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో డీటీ శశిశేఖర్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీలు గర్భిణులు, బాలింతలు, పిల్లలకు సేవలు అందిస్తున్నారన్నారు. మాతృ మరణాలు, శిశు మరణాలు తగ్గించడంలో కృషి చేస్తున్నారన్నారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలకు ఎఫ్ఆర్ఎస్ ద్వారా పౌష్టికాహారం అందించడం, గృహ సందర్శనల ద్వారా వారి యొక్క ఆరోగ్య పరిస్థితి తెలుసుకోవడం వంటి పనులు చేస్తున్నారు. అదనపు పనులను అప్పగించడం ద్వారా వారి యొక్క పనికి ఆటంకం కలుగుతుందన్నారు. అంగన్‌వాడీ వర్కర్లు శ్వేత, జానకి, రజియా, నరసమ్మ, జయలక్ష్మి పాల్గొన్నారు.

## మున్సిపల్ అధికారులు రాజకీయ పార్టీలను, నాయకులను విమర్శించడం విడ్డూరం



**ఆదోనిటౌన్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త;** మున్సిపల్ అధికారులు రాజకీయ పార్టీలను, నాయకులను విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని బీజేపీ సీనియర్ నాయకులు వెల్లాల మధుసూదన్‌శర్మ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత సోమవారం రోజున ఆదోని మున్సిపాలిటీ పరిధిలోని ఎస్కేడీ కాలనీలో కొన్ని ప్రాంతాల్లో కలుషిత నీరు సరఫరా చేయడం జరిగిందనే విషయాన్ని ప్రత్యక్షంగానూ పరోక్షంగానూ బయట పెట్టడం జరిగిందన్నారు. మరుసటి రోజున కమీషన్ వివరణ ఇచ్చి నట్టుగా కొంతమంది రాజకీయ పార్టీల నాయకులు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని, వారి మాటలు నమ్మవద్దని, స్వచ్ఛమైన ఫిల్టర్ చేసిన మంచినీటిని ఆదోని ప్రజలకు అందిస్తున్నామని మీడియా ద్వారా ఆదోని ప్రజలకు అబద్ధాలు చెబుతున్నారని కమీషనర్ విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. నేను మీడియా ద్వారా ప్రజల దృష్టికి, అధికారుల దృష్టికి తీసుకొచ్చినా ఎస్కేడీ కాలనీలో స్వచ్ఛమైన నీరు అందజేసి ఉంటే ఇప్పుడు ఈ పైపులైన్ రిపేరీ పనులు ఎందుకు చేస్తున్నారని సాక్ష్యాధారాలతో ఫోటోలను మీడియాకు విడుదల చేశారు. కాబట్టి మున్సిపల్ కమిషనర్ అధికారులు గానీ ప్రజా ప్రతినిధులు గానీ ప్రజలకు స్వచ్ఛమైన నీరు, పారిశుద్ధ్య పనులు, మెరుగైన విద్యుత్ మొదలైన వాటిని అందించాలే తప్పా రాజకీయాలు చేయకూడదన్నారు. రాజకీయాలు మాట్లాడాలి, రాజకీయాలు చేయాలి అనుకుంటే ఉద్యోగానికి రాజీనామా చేసి రాజకీయాలు చేయాలని కమీషనర్‌కు సూటిగా సలహా ఇచ్చారు.

## బాలసుబ్బయ్య సతీమణి వెంకటశేషమ్మ మృతి



**పగిద్యాల, ఏప్రిల్ 24,ప్రభాతవార్త :** పగిద్యాల గ్రామ పంచాయతీ పరిధిలోని పాలమర్రిలో వెలసిన శ్రీచెన్నకేశవస్వామి ఆలయ కమిటీ మాజీ సభ్యుడు బాలసుబ్బయ్య సతీమణి పి.వెంకటశేషమ్మ (74) శుక్రవారం మృతి చెందారు. నందికొట్కూరులో నివాసం వుంటున్న పగిద్యాల మండలం నెహ్రూనగర్ జెడ్పీపాఠశాల హెచ్ఎం పి.పెద్దనాగన్న పెద్ద కుమారుడి వద్ద గతకొంతకాలంగా వుంటున్న వెంకటశేషమ్మ అనారోగ్యంతో శుక్రవారం ఉదయం మృతి చెందడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. నందికొట్కూరు నుండి వెంకటశేషమ్మ భౌతికకాయం పగిద్యాల స్వగృహానికి తరలించారు. మృతి చెందినట్లు సమాచారం తెలియడంతో మాజీ జెడ్పీటిసి పుల్యాల నాగిరెడ్డి వెంకటశేషమ్మ భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలువేసి నివాళ్లుఅర్పించారు. ఆమె భర్త వెంటసుబ్బయ్య కుటుంబసభ్యులు ఒదార్చారు. ఆమె మృతికి సంతాపంతోపాటు కుటుంబసభ్యులకు తమ ప్రగాఢసానుభూతి తెలిపారు. మాజీ ఎంపిటిసి మిద్దె స్వాములు, మాజీవార్డు సభ్యులు గుంపుల ఈశ్వర్, గ్రామస్తులు కటుంబ సభ్యులు బంధువులు పాల్గొన్నారు. చివరిసారిగా వెంకటశేషమ్మకు కన్నీటివీడ్కోలు పలికారు.

## గోనెగండ్ల గంజహళ్లి ప్రధాన రహదారిపై మర్మత్తులు చేయండి



**గోనెగండ్ల, ఏప్రిల్ 24,ప్రభాతవార్త :** గోనెగండ్ల,గంజహళ్లి ప్రధాన రహదారి గుంతలమయంగా మరింది.అధికారులు వెంటనే స్పందించి రోడ్డులో పడిన గుంతలకు మర్మత్తులు చేయాలని కోరుతూ శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు జెండాలతో నిరసన కార్యక్రమం చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కాసీంవలి,జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి రాజశేఖరాచారి మాట్లాడుతూ వాహనాల రాక పోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉంది.కావున ఆర్అండ్‌బీ అధికారులు రహదారికి మర్మత్తు చేయాలని వారు డిమాండ్ చేశారు.పలు మార్లు ఉన్నతాధికారులకు విన్నవించినప్పటికి ఫలితం కనిపించలేదని వారు అన్నారు.గత కొన్ని మాసాలుగా గుంతలు పడిన రోడ్డు వెంట వాహనాలు వెళ్లేందుకు వాహదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు.దాదాపు ఇప్పటికి 20నుంచి 30 రోడ్డు ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి.గోనెగండ్ల నుంచి గంజహళ్లికి 10 నిమిషాలలో వెళ్లే ప్రయాణం గుంతల మయం కారణంగా అరగంట పైగానే పడుతుందన్నారు.రోడ్డు గుంతల మయంగా ఉంటే రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.కావున సంబంధింత అధికారులు స్పందించి రోడ్డుకు మర్మత్తు చేపట్టాలని వారు కోరారు.

## సమ్మత గేరిలో రీసర్వేపై గ్రామసభ



**హొళగుంద, ఏప్రిల్ 24, ప్రభాతవార్త;** మండలంలోని సమ్మతగేరి గ్రామంలో శుక్రవారం రీ సర్వేకు సంబంధించి గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రీ సర్వే డీటీ ముకుందరావు, విలేజ్ సర్వేయర్ సునీల్‌లుఎ మాట్లాడుతూ గ్రామ ప్రజలు రీ సర్వేని ఉపయోగించుకుని రైతులు హద్దులు, సర్వే నంబర్లు, ఖాతాలు విస్తీర ం అన్ని సరి చూసుకోవాలని కోరారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రికార్డులను సక్రమంగా పెట్టుకోవాలని రైతులకు సూచించారు. అలాగే వీఆర్వో నాగరాజు, గ్రామ వీఆర్ఏ, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పంచాయతీరాజ్ వ్యవస్థతోనే అభివృద్ధి

**దేవనకొండ, ఏప్రిల్ 24, ప్రభాతవార్త;** పంచాయతీరాజ్ వ్యవస్థతోనే అభివృద్ధి జరుగుతుందని ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి పేర్కొన్నారు. శుక్రవారం దేవనకొండ గ్రామ పంచాయతీ ఆవరణలో ఎంపీడీఓ జ్యోతి అధ్యక్షతన జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా జాతిపిత మహాత్మాగాంధీ, డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆమె మాట్లాడుతూ పంచాయతీరాజజ చట్టం అమలులోకి వచ్చి గ్రామాల్లోని ప్రజలకు మౌలిక వసతులు, విద్య, ఆరోగ్యం, పాలానాభివృద్ధి ప్రభుత ం చేపట్టిందన్నారు. టీడీపీ మండల కన్వీనర్ విజయ్‌భాస్కంరగౌడ్, ఇన్‌చార్జి డిప్యూటీ ఎంపీడీఓ రాముడు, సొసైటీ చైర్మన్ రాజశేఖర్‌గౌడ్, ఆలూరు మార్కెట్‌యార్డు చైర్మన్, వైస్ చైర్మన్ వెంకటేష్, మల్లేపల్లెరంగడు, టీడీపీ నాయకులు ఆకుల వీరేష్, బడిగింజల రంగన్న, కాకర్ల శాంతికుమార్ పాల్గొన్నారు.

## 140వ మేడే కార్మికుల దినోత్సవాన్ని జయప్రదం చేయండి



**ఆదోనిలీగల్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త;** 140వ మేడే కార్మికుల దినోత్సవాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ అధ్యక్ష కార్యదర్శులు పి.ఎస్.గోపాల్, తిప్పన్న అన్నారు. శుక్రవారం ఆదోని పట్టణంలోని ఎన్‌డీఆర్ ఫర్టిలైజర్ గోడౌన్ హమాలీల సమావేశం బి.రాజా అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సీఐటీయూ అధ్యక్ష కార్యదర్శులు పి.ఎస్.గోపాల్, తిప్పన్న మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా జరిగే కార్మికుల 140 మేడేను జయప్రదం చేయాలన్నారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయకుండా కాలయాపన చేస్తున్నాయన్నారు. ఈ సంక్షేమబోర్డు ఏర్పాటు చేయడం వల్ల హమాలీలకు వారి కుటుంబాలకు ఎంతో ఉపయోగపడేదన్నారు. పని సందర్భంలో ఏమైనా జరిగినా కుటుంబాలు రోడ్డున పడే అవకాశం ఉందన్నారు. సంక్షేమబోర్డు ద్వారా ఇన్సూరెన్స్, పీఎఫ్, బోనస్ సౌకర్యాలు ఇచ్చేవిధంగా కూటమి ప్రభుత్వం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే స్థానిక హమాలీఆల కూలీ రేట్ల అగ్రిమెంట్ గడువు పూర్తి అయ్యిందని, ఇప్పుడు నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగాయని, యాజమాన్యం వారు కూలీ రేట్లు పెంచాలని డిమాండ్ నోటీసు ఎన్‌డీఆర్ అవేఓజ్ లిమిటెడ్ కంపెనీ మేనేజర్‌కు అందించారు. ఈ కార్యక్రమంలో హమాలీలు నాగరాజు, గోవింద్, బాషా, రాజు పాల్గొన్నారు.

## మాతా శిశు మరణాలపై సమీక్షా సమావేశం

**నంద్యాల హాస్పటల్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:** స్తానిక సర్వజన ఆసుపత్రి నందు ఎం.సి.హెచ్.బ్లాక్‌నందు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్.వెంకటరమణ అధ్యక్షతన మాత శిశు మరణాలపై జిల్లా స్థాయి కమిటీ సమీక్షా సమావేశం జరిగ్దిఇ. బేతంచెర్ల పట్టణ ఆరోగ్య కేంద్రం-3 లో జరిగిన మాతృ మరణము మరియు శిశు మరణాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాదికారి మాట్లాడుతు క్షేత్రస్థాయిలో పనిచేసే ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎం లు,మరియు అంగన్వాడీ కార్యకర్తలు గర్భవతులను త్వరిగతిన గుర్తించి వారికి అంధించవలసిన సేవలను సకాలంలో అంధించి వారికి ప్రభుత్వ ఆసుపత్రులలో సుఖ ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని, పుట్టిన ప్రతి శిశువు ఆరోగ్యంగా ఉండాలని, భవిషత్తులో మాతృ మరియు శిశు మరణాలు జరగకుండా విధులను సక్రమంగా నిర్వహించాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఆయన తెలిపారు. అడిషినల్ డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్.శారదాబాయి, జిల్లా ఎమ్యునైజేషన్ అధికారి డా.సుదర్శన బాబు, ఎం.సి.హెచ్.ఓ. నోడల్ అధికారి డా.ప్రసన్నలక్ష్మి, గైనిక్ హెచ్‌ఓడి డా.లక్ష్మినారాయణమ్మ, అసోసియేట్ ప్రొఫెసర్ డా.సుధారాణి, డి.సీ.హెచ్.ఎస్.డా.లలిత, హెచ్‌ఓడి పీడియాట్రిసియన్ డా.రవీంద్రనాథ్‌రెడ్డి, అనస్తీసియా డా.శ్రీనివాసరావు, ఐసిడియస్ సిడిపిఓలు పాల్గొన్నారు.

## బీసీ బాలుర వసతి గృహాన్ని పున: ప్రారంభించాలి



**దేవనకొండ, ఏప్రిల్ 24, ప్రభాతవార్త;** మండలకేంద్రమైన దేవనకొండలో ప్రభుత్వ బీసీ బాలుర వసతిగృహాన్ని తక్షణమే పున: ప్రారంభించాలని, మండలంలో మోడల్ స్కూల్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని ఏఐఎస్ఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి కె.భాస్కర్ కోరారు. శుక్రవారం దేవనకొండకు వచ్చిన ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతిని ఆయన కలిసి వినతి పత్రం అందించారు. ఏఐఎస్ఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి కె.భాస్కర్ మాట్లాడుతూ మండలంలో నిత్యం కరువు, కాటకాలకు నిలయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కరువుతో పాటు నిరక్షరాస్యత అధికంగా ఉందన్నారు. ఈ ప్రాంతంలో ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్తున్నారని, వెళ్లే సమయంలో వారి పిల్లల చదువుకై ప్రభుత్వ పాఠశాలల్లో వదిలి వెళ్లడం జరుగుతుందన్నారు. మండలకేంద్రానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి వ్యయప్రయాసాలతో వందలాది మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారన్నారు. వారికి మండలకేంద్రంలో బీసీ బాలుర హాస్టల్, మోడల్ స్కూల్‌ను ఏర్పాటు చేసిన సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఏఐఎస్ఎఫ్ మండల నాయకులు రవితేజ, సుదర్శన్, హరి, అక్బర్, పురుషోత్తం, శీను, భాస్కర్ పాల్గొన్నారు.

## నేటి నుంచి రాష్ట్రస్థాయి టెన్నిస్ క్రికెట్ టోర్నమెంట్

**గడివేముల, ఏప్రిల్ 24, ప్రభాతవార్త;** మండలకేంద్రమైన గడివేములలోని శ్రీపేట లక్ష్మీ చెన్నకేశవ స్వామి రథోత్సవం సందర్భంగా రాష్ట్ర స్థాయి టెన్నిస్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శు క్రవారం తెలిపారు. ఇందులో గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతి రూ.50 వేలు, రెండో బహుమతి రూ.40 వేలు, మూడో బహుమతి రూ.30 వేలు, నాలుగో బహుమతి రూ.20 వేలు ఐదో బహుమతి రూ.10 వేలు, ఆరో బహుమతి రూ.5 వేలు చొప్పున అందజేస్తామన్నారు. ఎంట్రీఫీజు రూ.1500 చెల్లించి జట్ల పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 7799085879, 8688986855, 9014414026 నంబర్‌లను సంప్రదించాలన్నారు.

## ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవ వేడుకలు



**గడివేముల, ఏప్రిల్ 24, ప్రభాతవార్త;** మండలకేంద్రమైన గడివేములలో శుక్రవారం పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా గడివేముల పీఏసీఎస్ సింగిల్ విండో చైర్మన్ దేశం సత్యనారాయణరెడ్డి, ఏపీఓ వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి అంకన్న పాల్గొన్నారు. పంచాయతీరాజ్ దినోత్సవం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. పంచాయతీరాజ్ వ్యవస్థ వల్ల గ్రామాల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ గ్రామ అంబాసిడర్‌లకు శుభ్రత మీద అవగాహన కల్పించారు. అలాగే పరిశుభ్రత కిట్లు అందించారు.

## 27న దుర్గా భోగేశ్వరంలో లోకకళ్యాణార్థం స్వామివారి కళ్యాణం

**గడివేముల, ఏప్రిల్ 24, ప్రభాతవార్త;** వైశాఖ శుద్ధ ఏకాదశి సోమవారం లోక కళ్యాణం కోరుతూ శ్రీ దుర్గా భోగేశ్వరస్వామివారి ఆలయ ప్రాంగణంలోని కళ్యాణ మండపంలో స్వామివారి కళ్యాణం నిర్వహించేందుకు ఆలయ ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ కంది శ్రీనివాసులు, ధర్మకర్తల మండలి వారు నిర్ణయించినట్లు తెలిపారు. లోకకళ్యాణం మంచి పాడి పంటలు, ప్రకృతి వైపరీత్యాలు, ఆలయ అభివృద్ధి కోసం, స్వామివారి కళ్యాణం, రుద్రహోమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అందరూ పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు.

## ఉత్తమ పంచాయతీ డెవలప్‌మెంట్ అధికారిగా సుధాకర్



**మద్దికెర, ఏప్రిల్ 24, ప్రభాతవార్త;** ఉత్తమ పంచాయతీ డెవలప్‌మెంట్ అధికారిగా సుధాకర్ జిల్లా ఉన్నతాధికారుల చేతులమీదుగా శుక్రవారం ప్రశంసా పత్రం అందుకున్నారు. మండలంలోని పెరవలి, మద్దికెర మేజర్ గ్రామ పంచాయతీలో పంచాయతీ డెవలప్‌మెంట్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న సుధాకర్‌కు జిల్లా ఉన్నతాధికారులు ఆయన పంచాయతీకి చేసిన సేవలకు గుర్తుగా ఉత్తమ పంచాయతీ డెవలప్‌మెంట్ అధికారిగా ఎంపిక చేశారు. జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ చైర్మన్ పాపిరెడ్డి, సీఈఓ రమణారెడ్డి, డీపీఓ భాస్కర్ చేతులమీదుగా ఉత్తమ అధికారి ప్రశంసా పత్రం అందుకున్నారు. ఉత్తమ సేవలకు ప్రశంసా పత్రం అందుకోవడంతో మండలంలోని సిబ్బంది సుధాకర్‌కు అభినందనలు తెలిపారు.

## ఎస్సీ కార్పొరేషన్ నిధులను మంజూరు చేయాలి

– వైసీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు రేలంపాడు వెంకటేశ్వర్లు



**మద్దికెర, ఏప్రిల్ 24, ప్రభాతవార్త;** కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 2 సంవత్సరాలు పూర్తి అయినా ఇప్పటి వరకు ఎస్సీ కార్పొరేషన్ అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం చాలా బాధాకరమని వైసీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు రేలంపాడు వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీలకు ఇంతవరకు మంచి చేసిన దాఖలాలు లేవన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఎస్సీ కార్పొరేషన్‌కు నిధులు బడ్జెట్ కేటాయించి విడుదల చేస్తామన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ముఖ్యమంత్రి ఉప ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పటివరకు ఎస్సీ కార్పొరేషన్‌పై మాట్లాడే పరిస్థితి లేకపోవడం సిగ్గుచేటన్నారు.

## అంకాళమ్మ వారికి విశేష పూజలు



**శ్రీశైలంప్రాజెక్టు, ఏప్రిల్ 24, ప్రభాతవార్త :** లోక కల్యాణం కోసం శ్రీశైల క్షేత్ర గ్రామ దేవత అయిన శ్రీ అంకాళమ్మ వారికి శుక్రవారంనాడు ఉదయం అబిషేకం, విశేషపూజలను నిర్వహించడం జరిగింది. ప్రతి శుక్రవారం రోజున శ్రీ అంకాళమ్మ వారికి దేవస్థానం సేవగా (సర్కారిసేవగా) ఈ విశేష పూజ జరిపించబడింది. ఇందులో భాగంగా శ్రీ అంకాళమ్మ వారికి అభిషేకం, విశేష అర్చనలు, పుష్పాలంకరణ, కుంకుమార్చనలు జరిపించబడ్డాయి. శ్రీశైల క్షేత్రానికి గ్రామ దేవతగా చెప్పబడుతున్న అంకాళమ్మ ఆలయం, ప్రదాన ఆలయానికి ఎదురుగా గల రహదారిని చివరలో కుడివైపు ఉత్తరముఖంగా ఉంది. చతుర్భుజాలు కలిగిన ఈ దేవి నాలుగు చేతులలో కుడివైపున క్రింది నుండి పైకి వరుసగా కత్తి, సర్పంలో చుట్టబడిన ఢమురుకం ఉండగా, ఎడమవైపున పానపాత్ర, త్రిశూలం ఉన్నాయి.కిరీట ముకుటం గల ఈ దేవి వస్త్రాలంకురాలై కర్ణాభరణాలను, కంఠాభరణాలను కలిగి ఉంటుంది. కాగా కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహగణపతిపూజ జరిపించబడింది. ఆ తరువాత లోకకల్యాణాన్నికాంక్షిస్తూ అర్చకస్వాములు సంకల్పాన్ని పఠించారు. అనంతరం పంచామృతాభిషేకం, హరిద్రోదకం, కుంకుమోదకం, గందోదకం, పుష్పోదకం, విశేషఅబిషేకం అర్చనను నిర్వహించబడ్డాయి.

## ప్రజా సమస్యల పరిష్కారం కోసమే గ్రీవెన్స్ సెల్

**దేవనకొండ, ఏప్రిల్ 24, ప్రభాతవార్త;** ప్రజా సమస్యల పరిష్కారం కోసమే గ్రీవెన్స్ సెల్ నిర్వహిస్తున్నట్లు ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి పేర్కొన్నారు. శుక్రవారం మండలకేంద్రమైన దేవనకొండలో ప్రభుత్వ గెస్ట్ హౌస్ ఆవరణలో గ్రీవెన్స్ సెల్ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. పలు గ్రామాల ప్రజలు పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ముఖ్యంగా సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, ప్రజలకు మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

04 page 25_04 page 25.qxd 24-04-2026 PM 10:30 Page 1



# సేంద్రియ వ్యవసాయంపై.. కలెక్టర్ పరిశీలన

**కర్నూలు అర్బన్ ఏప్రిల్ 24 ప్రభాతవార్త :**

కల్లూరు మండలంలోని తడకనపల్లె గ్రామంలో పిఎండిఎస్ సేంద్రియ వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తున్న పొలాలను జిల్లా కలెక్టర్ ఏ. సిరి పరిశీలించారు. ఈ సందర్భంగా పిఎండిఎస్ విధానంలో చేపడుతున్న సాగు విధానాలు, వాటి వల్ల రైతులకు కలిగే ప్రయోజనాలపై అధికారులు వివరించారు. అలాగే"ఆఫ్ మూన్ మోడల్"ను కూడా కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా రైతులతో సమావేశం ఏర్పాటు చేసి,"ధర్తీ మాతా బచావో" అనే సందేశంతో నేల భూసారాన్ని కాపాడుకోవాలని సూచించారు. రైతులు ఏకపంటపై ఆధారపడకుండా పలు రకాల పంటలు, అంతర పంటలు మరియు మిశ్రమ పంటలు సాగు చేయాలని సూచించారు. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవడం, పండ్లు మరియు పూల తోటల సాగుపై దృష్టి పెట్టాలని చెప్పారు. అలాగే ఏపీఎంఐపి ద్వారా స్ప్రింక్లర్ పద్ధతికి 50 శాతం, డ్రిప్ సించాయికి



90 శాతం సబ్సిడీ లభిస్తుందని, రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి పి.ఎల్. వరలక్ష్మి, సహాయ వ్యవసాయ సంచాలకులు (రే) సాలు రెడ్డి, కల్లూరు తహశీల్దార్ ఆంజనేయులు, డీపీఎం మాధురి, మండల వ్యవసాయ అధికారి విష్ణు వర్ధన్ రెడ్డి, హార్టికల్చర్ ఆఫీసర్ నరేష్ రెడ్డి, జెడ్ బి ఎం ఎఫ్ సిబ్బంది మరియు రైతులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య పనులు పక్కాగా చేపట్టాలి

**- నగరపాలక సంస్థ కమిషనర్ ఓబులేసు**
**- నగరంలో వందశాతం చెత్తసేకరణ లక్ష్యం**

**కర్నూలు మున్సిపల్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:**

నగరంలోని అన్నిశానిటేషన్ డివిజన్ల పరిధిలో పారిశుద్ధ్య పనులు ఖచ్చితంగా సమర్థవంతంగా అమలు చేయాల్సిన అవసరాన్ని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు స్పష్టం చేశారు. పారిశుద్ధ్య నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని పేర్కొన్నారు. శుక్రవారం బుధవారపేట, సీ క్యాంపు ప్రాంతాల్లో నిర్వహించిన తనిఖీల సందర్భంగా పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించి, సిబ్బంది హాజరును తనిఖీచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 5.15 గంటల కల్లా సిబ్బంది హాజరును ప్రారంభించి 5.30 గంటల లోపు విధుల్లోకి వెళ్లాలన్నారు. ప్రతికార్మికుడు తప్పనిసరిగా డ్రస్‌కోడ్ పాటించాలని లేనిపక్షంలో గైర్హాజరు నమోదుచేయాలని సూచించారు. ప్రతి ఇంటి వద్ద విజిల్ వేయడం, కాలింగ్ బెల్ కొట్టడం ద్వారా చెత్తను తప్పనిసరిగా స్వీకరించి వందశాతం చెత్తసేకరణ సాధించాలని స్పష్టం చేశారు. అదేవిధంగా గార్గేయపురం, జొహరాపురం డంప్‌యార్డులను పరిశీలించి గార్గేయపురంలో బయోమైనింగ్ పనులను వచ్చే నెలాఖరుకు పూర్తిచేయాలని ఆదేశించారు. కార్యదర్శి నాగరాజు, ఎంఈ గిరిరాజ్, డీఈఈలు పవన్‌కుమార్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, ఏఈ సి వైష్ణవి పాల్గొన్నారు.



## రాయితీలను పన్నుదారులు సద్వినియోగం చేసుకోవాలి

**- నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు**



**కర్నూలు మున్సిపల్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:**

రాష్ట్ర ప్రభుత్వం ఆస్తి పన్నుల చెల్లింపులపై కల్పిస్తున్న రాయితీలను పన్నుదారులు సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు కోరారు. నగరపాలక కార్యాలయంలో పన్ను వసూలు కేంద్రాన్ని పరిశీలించారు. అదేవిధంగా దూపాడు, లక్ష్మీపురంకు చెందిన విశ్వనాథ్ ఎడ్యుకేషన్ సొసైటి, ఆశోక్ ఉమెన్స్ ఇంజనీరింగ్ కళాశాల నుండి రూ.12,90,163లు ముందస్తు ఆస్తిపన్ను చెక్‌ను స్వీకరించగా వారికి రూ.67,573 రాయితీ లభించిందన్నారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఆస్తి పన్ను బకాయిలను ఏకమొత్తంలో చెల్లించిన వారికి 50 శాతం వడ్డీరాయితీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పన్నును ఏకమొత్తంలో చెల్లించిన వారికి 5 శాతం రాయితీ ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఏప్రిల్ 30 లోపు ప్రజలందరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పన్నులు సమయానికి చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో మేనేజర్ చిన్నరాముడు, తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే భూమా శోభా నాగిరెడ్డి కి ఘన నివాళులు



**నంద్యాల హాస్పిటల్, ఏప్రిల్ 24,ప్రభాతవార్త:**

పట్టణంలోని ఆటోనగర్ నందు భూమా శోభా ఘాట్ వద్ద దివంగత నేత మాజీ ఎమ్మెల్యే భూమా శోభానాగిరెడ్డి 12వ వర్ధంతి సంధర్భంగా పలువురు ఘన నివాళీలు అర్పించారు. శుక్రవారం మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళీలు అర్పించారు. ఆళ్ళగడ్డ నియోజకవర్గంలోని ప్రజల పట్ల ఆపారమైన ప్రేమ, సేవా తత్వం, రాజకీయాల్లో ఆమె చూపిన ధైర్యం, నిబద్ధతను ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో టీడిపి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## శ్రీ చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానంలో విశేష పూజలు



**బనగానపల్లె, ఏప్రిల్ 24 ప్రభాత వార్త:**

మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానంలో అమ్మవారి జన్మ నక్షత్రం పుష్యమి మరియు శుక్రవారం సందర్భంగా ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా ఉదయం ఆలయంలో విశేష పూజలు, విశేష హోమం భక్తిశ్రద్ధల మధ్య నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణతో నిర్వహించిన పూజలు వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య భక్తులను ఆకట్టుకున్నాయి. అనంతరం సాయంత్రం పల్లకి సేవను వైభవంగా నిర్వహించారు. అలంకరించిన పల్లకిలో అమ్మవారిని ఆలయ ప్రాంగణంలో ఊరేగించడంతో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమాలు ఆలయ కార్యనిర్వహణాధికారి నల్లకాలువ శ్రీనివాస రెడ్డి, ఆలయ చైర్మన్ నాగార్జున రెడ్డి, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ కుమార్ రెడ్డి వారి పర్యవేక్షణలో నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, వేదపండితులు, అర్చకులు, పూజారులు మరియు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## మనస్థాపంతో వ్యక్తి మృతి

**చాగలమర్రి ఏప్రిల్ 24: ప్రభాతవార్త :**

మండల పరిధిలోని ముత్యాలపాడు గ్రామంలో కాళ్ల నడిపి మల్లయ్య ( 48) జీవితంపై విరక్తి చెంది శుక్రవారం ఉరి వేసుకుని మృతి చెందాడు. ఇతనికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. సుమారు 20 రోజుల క్రితం తన కుమారుడైన సాయికి నిశ్చితార్థమైంది. నిశ్చితార్థం ఇష్టం లేక తనకు మర్యాద ఇవ్వలేదని మనస్థాపం చెంది తెల్లవారుజామున చీరతో ఉరి వేసుకుని చనిపోయాడు. భార్య లక్ష్మిపిర్యాలతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# పెట్రోల్ కొరతపై కఠిన చర్యలు



**: పెట్రోల్ బంకులపై పర్యవేక్షణ కట్టుదిట్టం**
**: ప్రతి బంకుకు ప్రత్యేక పర్యవేక్షణ అధికారుల నియామకం**

**కర్నూలు, ఏప్రిల్ 24, ప్రభాతవార్త :**

జిల్లాలో పెట్రోల్, డీజిల్ సరఫరా మరియు విక్రయాల పరిస్థితిపై జిల్లా కలెక్టర్ మరియు జాయింట్ కలెక్టర్ అధికారులు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్డీవోలు, తహసిల్దార్లు, పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహసిల్దార్లు, డీఎస్ఓ, ఏఎస్ఓలు, ఆయిల్ కంపెనీల సేల్స్ ఆఫీసర్లు, పెట్రోల్ బంకుల యజమానులు పాల్గొన్నారు. సమావేశంలో ఇంధన నిల్వలు ఉన్నప్పటికీ విక్రయాలు చేయని పెట్రోల్ బంకులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వినియోగదారులకు ఇబ్బందులు కలగకుండా సేల్స్ ఆఫీసర్లు నిరంతరం పర్యవేక్షణ జరిపి, నిల్వలు తగ్గుతున్న బంకులకు తక్షణమే లోడ్లు సరఫరా చేయించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే ప్రతి పెట్రోల్ బంకుకు ఒక పర్యవేక్షణ అధికారిని నియమించాలని తహసిల్దార్లకు సూచించారు. వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రతి బంకులో తాగునీరు, టాయిలెట్ వంటి కనీస సదుపాయాలు కల్పించడం తప్పనిసరిగా చేయాలని తెలిపారు. ఇంధనాన్ని అధిక ధరలకు విక్రయించే ఘటనలు ఎక్కడైనా వెలుగులోకి వస్తే సంబంధిత వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో ఇంధన సరఫరా వ్యవస్థను సక్రమంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులు ఆదేశించారు.

# దళితవ క్రైస్తవులగర్జన.. పోస్టల్‌ను విడుదల చేసినమంత్రి

**నంద్యాల ,ఏప్రిల్ 24,ప్రభాతవార్తప్రతినిధి**

నంద్యాల పట్టణంలోని మున్సపల్ కార్యాలయంలో ఛలో నంద్యాల దళిత క్రైసత్వవుల గర్జన కార్యక్రమానికి సంబందించిని వాల్ పోస్టరును మంత్రి యన్‌యండి ఫరూక్ శుక్రవరాము అవిస్కరించారు. ఈసందర్భయగూ మంత్రి మాట్లాడుతూ దళిత క్రైస్తవుల సమస్యల పరిస్కారం కోసం మరియు వారి హక్కుల సాదన కోసం నిర్వహిస్తున్న ఈ సభవిజయవంతము కావాలని అకాంక్షించారు. వచ్చే నెల 9వ తేదిన శనివారము ఉదయం 9గంటలకు దేవనగరులోని యస్‌పిజి గ్రౌండు నందుగల రైడర్ మెమోరియల్ హాల్‌లో ఈ బారీ బహిరంగ సభ జరుగునుందని తెలిపారు. దళిత క్రైస్తవ సోదరీ సోదరిమణులు అందరూ తమ సమస్యలను సామరస్యంగా పరిస్కరించుకోవాలని ఒకరికి ఒకరు సహకరించుకోవాలని తెలిపారు. ఈకార్యక్రమంలో మాజీ కౌన్సిలరు కృపాకరు రాజ్ మహేంద్రకార్యాక్రమ



కన్వినరు, యనుమల రాజీవ్‌కుమారు,వేల్పుల విజయకుమారు టిడిపి నాయకులు జార్జ్‌ఇమ్మాన్యు యేలు ,సౌబాగ్య,సురేష్, మరియు వివిద దళిత క్రైస్తవ సంఘాల ప్రతినిదులు పాల్గొన్నారు. ఈ గర్జన సభకు మేదావులు రాజకీయనాయకులు యువత మరియుప్రజా సంఘాల నాయకులు పార్టిలకు అతీతంగా పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదము చేయాలని నిర్వాహకులు పిలుపు నిచ్చారు.

# 6 నుండి 14 ఏళ్లలోపు పిల్లలందరినీ బడిలో చేర్పించాలి

**ఇంటింటికి వెళ్లి తల్లిదండ్రులకు ప్రభుత్వ బడుల గురించి అవగాహన కల్పించిన కలెక్టర్ జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి**

**వెల్దుర్తి , ఏప్రిల్ 24, ప్రభాతవార్త :**

బడి పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా 614 సంవత్సరాల పిల్లలందరినీ బడిలో చేర్పించాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి విద్యా శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం బడి పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా వెల్దుర్తి మండల కేంద్రం హరిజనవాడలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులను చేర్పించే కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం ఇంటింటికి వెళ్లి విద్యార్థులను, తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య, వసతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బడి పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో 6 నుండి 14 సంవత్సరాల పిల్లలను వంద శాతం బడిలో చేర్పించాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థుల ఎన్రోల్మెంట్ డ్రైవ్ పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇంటింటికి వెళ్లి, తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలలలో ఉన్న సౌకర్యాలను, వివరించి వారి పిల్లలను పాఠశాలల్లో చేర్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ ముందుగా 5 వ తరగతి చదవడం పూర్తై 6 వ తరగతి కి వెళ్తున్న విద్యార్థులతో మాట్లాడుతూ ప్రతి రోజూ డిక్షనరీ నుండి కొత్త 5 రకాల ఇంగ్లీష్ పదాలను నేర్చుకోవాలన్నారు. న్యూస్ పేపర్ చదువుకోవాలని, స్టోరీ బుక్స్ చదువుకోవాలని కలెక్టర్ విద్యార్థులకు సూచించారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు బయట తిరగకూడదన్నారు. ఎక్కువ నీరు తాగాలన్నారు.. టీచర్లు విద్యార్థులపై చూపే శ్రద్ధను కలెక్టర్



ప్రశంసిస్తూ, ఉపాధ్యాయులు ఎంత బాగా కేర్ తీసుకుంటే అంత మంది పిల్లలు పాఠశాలలో చేరుతారని కలెక్టర్ పేర్కొన్నారు. 5 వ తరగతి పూర్తి చేసిన 41 మంది విద్యార్థులు 100 శాతం సమీపంలోని ఉన్నత పాఠశాలల్లో 6 వ తరగతి చేరడంతో కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు.అంగన్వాడీ నుండి 1 వ తరగతికి నూతన అడ్మిషన్ తీసుకున్న పిల్లలతో కలెక్టర్ మాట్లాడుతూ మన జిల్లా, మండలం, గ్రామం పేర్లు అడగగా వారు చాలా చక్కగా సమాధానం ఇవ్వడంతో కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. అంగన్వాడి సెంటర్ లో ఏ ఏ భోజనాలు పెట్టేవారు అని అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ కేంద్రంలో ఉన్న 42 మంది పిల్లలో, 36 మంది పిల్లలు ఫస్ట్ క్లాస్‌లో అడ్మిషన్ తీసుకున్నారని, మిగిలిన వారు కూడా ఎన్రోల్మెంట్ అయ్యే విధంగా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో ఉన్న పిల్లలు హరిజనవాడలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 1వ తరగతిలో చేరిన పిల్లలకు కలెక్టర్ తల్లిదండ్రులకు అడ్మిషన్ పత్రాలను అందచేశారు.ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు చెప్తున్న పాఠాలకు, కల్పిస్తున్న మౌలిక సదుపాయాలకు సంతృప్తి వ్యక్తం చేసిన తల్లులు ఖబడి పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా వెల్దుర్తి మండల కేంద్రం హరిజనవాడలో వరలక్ష్మి, జస్టిన్, మహేశ్వరి ఇళ్లకు కలెక్టర్ వెళ్లి ప్రభుత్వ బడుల్లో ఉన్న నాణ్యమైన విద్య, వసతులపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యాబోధన, రుచి, శుచికరమైన మధ్యాహ్న భోజనం, యూనిఫార్మ్, పుస్తకాలు తదితర వసతులన్నీ కల్పించడం జరుగుతుందని, పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని అవగాహన కల్పించారు. తల్లులు స్పందిస్తూ తమ పిల్లలు ప్రభుత్వ పాఠశాలలోనే చదువుతున్నారని, వచ్చే తరగతికి కూడా ప్రభుత్వ పాఠశాలలోనే అడ్మిషన్ తీసుకున్నామని, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలు చాలా బాగా ఉన్నాయని, ఉపాధ్యాయులు చాలా బాగా పాఠాలు చెబుతున్నారని సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో డిఈఓ సుధాకర్, జడ్పిసిఓ రమణారెడ్డి సర్వ శిక్ష అభియాన్ పిఓ లోకరాజ్, ఎంపీడీవో చంద్రశేఖర్ రెడ్డి,ఎమ్ ఈ ఓలు ఇందిర , రమేష్, సిడిపిఓ లుక్, సూపర్వైజర్లు,అంగన్వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

## యువకుడు దారుణ హత్య

**: డీజే డాన్స్ వద్ద ఘర్షణ**

**కర్నూలు, ఏప్రిల్ 24, ప్రభాతవార్త :**

ఓర్వకల్లు మండల పరిధిలోని ఉయ్యాలవాడ గ్రామంలో గురువారం అర్ధరాత్రి దాదాపు 12 గంటల సమయంలో శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి తిరుణాల సందర్భంగా నిర్వహించిన డీజే కార్యక్రమం వద్ద చోటుచేసుకున్న ఘర్షణలో యువకుడుమనోజ్ కుమార్ (23) కత్తిపోటుకు గురై మృతి చెందాడు.. గ్రామంలో జరిగిన డీజే కార్యక్రమంలో మనోజ్ కుమార్ తమ్ముడు మధుబాబు డాన్స్ చేస్తుండగా, అదే గ్రామానికి చెందిన ఎరుకల వంశీ అతడిని పక్కకు తోశాడని ఈ విషయంపై మనోజ్ కుమార్, మధుబాబు ఇద్దరూ వంశీతో వాగ్వాదానికి దిగడంతో ఘర్షణకు దారితీసింది. ఈ



సమయంలో మనోజ్ కుమార్ చిన్నాయన మద్దిలేటి వారిని అక్కడి నుంచి ఇంటికి తీసుకెళ్లగా . అయితే కొద్దిసేపటి తరువాత వంశీ తన తల్లిదండ్రులు వెంకటలక్ష్మి, శ్రీరాములు మరియు బంధువులతో కలిసి మద్దిలేటి ఇంటికి చేరుకుని మళ్లీ గొడవకు దిగడంతో . వంశీ కత్తితో మనోజ్ కుమార్ గొంతులో పొడిచినట్లు మృతుడి కుటుంబ సభ్యులు తెలిపారు . అదే సమయంలో గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిచి పోయిందని. తీవ్రంగా గాయపడిన మనోజ్ కుమార్‌ను వెంటనే కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి కారులో తరలించగా మార్గమధ్యంలోనే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడు ఈడుగోటి వెంకటేశ్వర్లు, లలితమ్మ దంపతుల పెద్ద కుమారుడు కాగా, కర్నూలు నగరంలోని జంపాల శివయ్య నగర్‌లో నివసిస్తూ కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. చింతలపల్లి గ్రామానికి చెందిన లక్ష్మీకాంత్ కుమార్తె వెంకటేశ్వరమ్మతో సుమారు 45 రోజుల క్రితం వివాహం జరిగిందని తిరుణాల కోసం గ్రామానికి వచ్చిన సమయంలోనే ఈ ఘటన చోటుచేసుకోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. మృతుడి తమ్ముడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. దర్యాప్తు కొనసాగుతోందని, న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## వైభవంగా శ్రీస్వామిఅమ్మవార్లకు ఊయలసేవ

**శ్రీశైలంప్రాజెక్టు,ఏ ప్రిల్24,ప్రభాతవార్త :**

లోక కల్యాణం కోసం దేవస్థానం శుక్రవారంనాడు సాయంకాలం శ్రీస్వామిఅమ్మవార్లకు ఊయల సేవ వైభవంగా నిర్వహించడం జరిగింది.ప్రతి శుక్రవారం రోజు మరియు పౌర్ణమి,మూలా నక్షత్రం రోజులలో ఈ ఊయలసేవ జరిపించబడుతోంది.కాగా లక్షకుం కుమార్చన తరువాత ఈ ఊయలసేవ జరిపించబడింది.ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా లోకకల్యాణాన్నికాంక్షిసూ అర్చకస్వాములు సేవా సంకల్పాన్ని పఠించారు.తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహగణపతిపూజ జరిపించబడింది. అనంతరం ఊయలలో వేంచేబు చేయించిన శ్రీస్వామిఅమ్మవార్లకు శాస్త్రోక్తంగా షోడపచార పూజ జరిపించబడింది.తరువాత చివరగా ఊయలసేవ నిర్వహించబడింది.ఊయలసేవను పురస్కరించుకోని శ్రీస్వామిఅమ్మవార్లకు విశేషంగా పుష్పలంకరణ,పుష్పార్చనలు జరిపించబడ్డాయి.

## దివంగత నేత భూమా శోభానాగిరెడ్డి ఆశయాల సాధనకు కృషి

**- ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ**



**ఆళ్లగడ్డ, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:**

దివంగత నేత భూమా శోభానాగిరెడ్డి ఆశయాల సాధనకు కృషిచేస్తామని ఎమ్మెల్యే భూమా అఖీల ప్రియ తెలిపారు. శుక్రవారం భూమా శోభానాగిరెడ్డి 12వ వర్ధంతి సందర్భంగా భూమా ఘాట్ వద్ద భూమా అఖీల ప్రియ, భార్గవ్‌రాం దంపతులు, టీడీపీ యువ నాయకులు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డిలు శోభానాగిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే భూమా అఖీల ప్రియ మాట్లాడుతూ శోభానాగిరెడ్డి చనిపోయి 12 సంవత్సరాలు అవుతుందంటే నమ్మలేక పోతున్నామన్నారు. అమ్మచనిపోయినా తర్వాత నన్ను భూమా నాగిరెడ్డి ఎమ్మెల్యేగా చేసి కార్యకర్తలకు భూమా అభిమానులకు శోభానాగిరెడ్డిని ఎలా చూసుకుంటారో అఖీల ప్రియను కూడ అలా చూసుకోవాలని చెప్పడం జరిగిందన్నారు. అమ్మ నాన్నలు కార్యకర్తలకు ఎంతో భరోసా ఇచ్చారో అదేవిధంగా మేం కూడ భూమా కార్యకర్తలకు అండగా ఉంటామని మీరు చూపించే అభిమానాన్ని మేం ఎన్నడు మరువలేమని ఆమె తెలిపారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, భూమా అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## నీటిఎద్దడి తలెత్తకుండా అధికారులు తగిన చర్యలు చేపట్టాలి

**- అధికారును ఆదేశించిన ఎంఎల్ఏ గిత్త జయసూర్య**

**పగిడ్యాల, ఏప్రిల్ 24,ప్రభాతవార్త :**

పగిడ్యాల మండలంలో వేసవిలో నీటిఎద్దడి తలెత్తకుండా అధికారులు తగిన చర్యలు చేపట్టాలనీ, అదేవిధంగా ప్రజా సమస్యల పరిష్కారవేదికలో ప్రజల నుంచి వచ్చిన వినతిపత్రాలకు పరిశీలించి సమస్యలను అలస్యం చేయకుండా పరిష్కరించాలనీ ఎంఎల్ఏ గిత్త జయసూర్య అధికారులను ఆదేశించారు. స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్ర మానికి హజరైన ఎంఎల్ఏ ప్రజల నుండి వచ్చిన వినతిపత్రాలను ఆయాశాఖల అధికారులకు అందజేసివాటిని ఆలస్యంచేయకుండా పరిష్కరిచాలన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ గిత్త జయసూర్య మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారవేదికలో 139 సమస్యలు రాగా వాటిలో 89శాతం పరిష్కరిచడం జరిగిందనీ, 11శాతం పరిష్కరించవలసివుంటుందనీ వాటిని కూడా పరిష్కరిస్తామన్నారు. స్థానిక స్మశాన వాటికలకు రోడ్డుసౌకర్యంలేక ఇబ్బందులకు గురువుతున్నామనీ ఎంఎల్ఏ దృష్టికి తేవడంతో పరిష్కరించమనీ సూచించారు. మండంలోచేపట్టిన సిసిరోడ్ల నిర్మాణాలు మే 15లోపు పూర్తిచేసి ప్రారంభించేందుకు సిద్దచేయాలన్నారు. సంకిరేణిపల్లెలో నీటిసమస్యను పరిష్కరించాలనీ ఎంఎల్ఏ దృష్టికితేవడంతో ఆర్‌డబ్ల్యూఎస్ జెఈ సత్వరమే పరిష్కరించాలనీ ఆదేశించారు. పగిడ్యాల ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో రాత్రివేళలల్లో ఎప్పుడు వెళ్లినా సిబ్బంది అందుబాట్లో వుండటంలేదనీ ఎంఎల్ఏ దృష్టికి తెచ్చారు. కొణిదేలలో ఇలా సిబ్బదిపై పిర్యాదులు అందాయనీ కావున వైద్యాధికారి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. మండలంలో మిగిలిపోయిన రోడ్లు అన్నికూడాను పూర్తిచేయాలనీ అధికారులకు ఎంఎల్ఏ గిత్త జయసూర్య ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శివరాముడు, ఎంపిడిఓ శ్రీమతి సుమిత్రమ్మ, డిప్యూటీ ఎంపిడిఓ అబ్బార్ రహీం, జిఎస్‌డబ్లూఓ మన్సూర్, ఎంఈఓలు పి.సుభాన్, మురళీమోహన్‌రెడ్డి, హౌసింగ్ ఎఈ అనిల్, పిఆర్ఎఈ జావీద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఈ శివకుమార్, ఎపిఓ మద్దిలేటి, ఎపిఎం కళావతి, వైద్యాధికారి డాక్టర్ అనిల్‌కుమార్, కెసికెనాల్ ఎఈ వీరమ్మ,సింగిల్ విండో చైర్మెన్ దామోదరరెడ్డి, టిడిపి నాయకులు మహేశ్వరరెడ్డి, వాసురెడ్డి, పుల్యాల రాజశేఖరరెడ్డి, ఒగిలి శ్రీనివాసులు, అధికారులు అదితరులు పాల్గొన్నారు.

